

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శుక్రవారం 5 ఏప్రిల్ 2024 12 పేజీలు


# నేతన్నలపై కక్ష కట్టిన కాంగ్రెస్ సర్కారు

## - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



- నేతన్నల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ
- ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే అవమానిస్తున్నారు
- పదేళ్లపాటు వెలుగు వెలిగిన వస్త్ర పరిశ్రమలో కాంగ్రెస్ పార్టీతో చీకట్లు కమ్ముకున్నాయి
- భేషజాలకు పోకుండా గత ప్రభుత్వ పథకాలు కొనసాగించాలి
- సిరిసిల్ల నేత పరిశ్రమకు రావలసిన 270 కోట్ల బకాయిలు విడుదల చేయాలి

**సూర్య రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమకు చెందిన నేతన్నలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు ఈ మేరకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ఒక బహిరంగ లేఖను రాశారు.బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు పండుగలా కళకళలాడిన చేనేత,పవర్ లూమ్ రంగం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. గత కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో, అవే విపత్కర పరిస్థితులు మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాగులునెలలు గడవకముందే వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతోపాటు,పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని, పవర్ లూమ్ ఆసాములతోపాటు (మిగతా 2లో)

# తాగునీటికి ఇబ్బందులు అసలే రావద్దు

## -అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి..
## -ఇబ్బందులు ఉన్నచోట వెంటనే పరిష్కరించాలి..
## -ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి..

## ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

## తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

వేసవికాలం నేపథ్యంలో తాగునీటికి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాల్లో తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, (మిగతా 2లో)

# లక్ష్యం"గా నిర్మించారు....
# "లక్షణం"గా వదిలేశారు....

## -ప్రారంభించారు సరే?..
## భవనం సద్వినియోగం ఎప్పుడో?...
## -శునకాలకు ఆవాసంగా మారిన తీరు..

**సూర్య మల్యాల**

మల్యాల మండలం కేంద్రంలోప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గత కొద్ది నెలల క్రితమే నిర్మించిన నూతన భవనాన్ని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.కానీ నూతన భవనాన్ని ప్రారంభించినప్పటికీ ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పాత భవనంోనే ప్రాథమిక ఆరోగ్య సేవలు కొనసాగుతున్నాయి.. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. నూతన భవనం లక్షలాది రూపాయలతో నిర్మించి వినియోగంలోకితేకుండా లక్షణంగా అధికారులు వదిలేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా భవనాన్ని నిర్మించి ప్రజాప్రతినిధులు ప్రారంభించినప్పటికి తాళం వేసి ఉండివినియోగంలోకిలేకపోవడంతో ఆరోగ్య (మిగతా 2లో)



# నీటి సరఫరా అంచనాలను సిద్ధం చేయండి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**సూర్య గోదావరిఖని:**

రాబోయే మూడు నెలలకు గాను హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా (హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్) కు సంబంధించి అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఇక్కడి అంతర్గాం మండలంలోని ముర్మూర్ లో ఉన్న 160 ఎం.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి శుద్ధి తీరు, ఇతరాత్రా అంశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ కు చెందిన ఇంటెక్ వెల్ ను కలెక్టర్ సందర్శించారు. గోదావరి నుంచి నీటి డ్రాయింగ్ పాయింట్ పరిశీలించిన కలెక్టర్ అందుబాటులో ఉన్న నీరు, ప్రతి రోజూ ఎంత సరఫరా చేస్తున్నారు.. వంటి పలు అంశాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ ఇంటెక్ వెల్ నుంచి హైదరాబాద్ ప్రజల త్రాగునీటి (మిగతా 2లో)

# కేసీఆర్...

## మీ తీరు మనిషిని చంపేసి ఆ ఫొటోకు దండం పెట్టినట్లుంది

- -మీ హయాంలో పంట నష్టపోయి, వడ్లు కొనే దిక్కులేక ప్రాణాలు వదిలితే పట్టించుకున్నారా?
- -ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణచెప్పి కరీంనగర్‌కు రండి
- -బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



**సూర్య కరీంనగర్ ప్రతినిధి** (వివరాలు 2లో)

# ఆర్టీసీ బస్సు బైకు ఢీ....

## -ఒకరు మృతి ఒకరికి గాయాలు..

**సూర్య శంకరపట్నం** (వివరాలు 2లో)





# నేతన్నలపై కక్ష కట్టిన కాంగ్రెస్ సర్కారు

*(మొదటి పేజీ తరువాయి)*

కార్మికులు రోడ్డునపడటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కారు చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని,ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో నేతన్నల జీవితాలు దుర్భరంగా మారుతున్నా ప్రభుత్వానికి కనీస కనికరం లేకపోవడం దురదృష్టకరమన్నారు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మిక లోకం ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో ఏదో ఒక రూపంలో ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం అత్యంత దారుణమైన విషయమని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటంతో నేతన్నల మనోస్థైర్యం మరింత దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరి వేసుకుని తనువు చాలించాడన్న కేటీఆర్, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారన్నారు. గత బి ఆర్ ఎస్ హయాంలో నేతన్నల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్న కేటీఆర్, సర్వ శిక్ష అభియాన్, రాజీవ్ విద్యా మిషన్ ఆర్డర్ల ద్వారా నేత కార్మికులకు పని కల్పించడమే కాకుండా బతుకమ్మ చీరల పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వెలుగులు నింపిందన్నారు. చేనేత మిత్ర,నేతన్నకు చేయూత వంటి పథకాలు ప్రవేశపెట్టి నేత కార్మికులకు అన్ని విధాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు.తెలంగాణ సాధించిన క్షణం నుంచి పదేళ్ల పాటు పండుగలా మారిన వస్త్ర పరిశ్రమ చుట్టూ మళ్లీ కాంగ్రెస్ రాగానే చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయన్న ఆయన ,పరిశ్రమను దెబ్బతీసి, కార్మికుల జీవితాలతో చెలగాటమాడేదీరును కాంగ్రెస్ ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను భేషజాలకు వెళ్లకుండా కొనసాగించాలని కోరారు.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి ఏడాది బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించి జీవో ను ఫిబ్రవరి మాసంలోనే విడుదల చేసేదని, కానీ మార్చి నెల ముగుస్తున్న కాంగ్రెస్ సర్కారు వైపు నుంచి కదలిక లేకపోవడంతో నేతన్నల్లో ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు.35 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలకు సంబంధించిన కీలకమైన సమస్య కాబట్టి వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి వెంటనే బతుకమ్మ చీరల ఆర్డర్లు అందించి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని తన లేఖలో కేటీఆర్ కోరారు. యార్న్ సబ్సిడీ ని కూడా వెంటనే విడుదల చేయాలని, చేనేత మిత్ర పథకాన్ని కొనసాగించాలన్నారు. మూలన పడిన సాంచాలను తిరిగి తెరిపించడానికి పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్లు బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు.ప్రభుత్వం వేంటనే ఈ అంశంపై వేగంగా స్పందించి, నేతన్నలకు అదుకోవాలని ప్రధాన ప్రతిపక్షంగా కొరుతున్నామన్న కేటీఆర్, ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రంలోని బడుగు,బలహీన వర్గాల నేతన్నలు తమ పొట్టకొడుతున్న కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించరన్నారు.

## ఆర్టీసీ బస్సు బైకు ఢీ....

**సూర్య, శంకరపట్నం**

ఆర్టీసీ బస్సు బైక్ ను ఢీకొట్టడంతో అక్కడికక్కడేఒకరు మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండల పరిధిలో కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా గురువారం రోజు చోటుచేసుకుంది. మండలంలోని చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు ( 33 )అనే వ్యక్తి మంద హరీష్, మరో వ్యక్తి బైక్ నడుపుతూ వెళ్లగా కరీంనగర్ వైపు వెళ్తున్న, సిరిసిల్ల డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వెళ్తున్న బైకు ను వెనకాల బలంగా ఢీ కొట్టడంతో బైక్ పై వెళ్తున్న వెనకాల కూర్చున్న సిరిసిల్ల ఆంజనేయులు ను బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు.మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సింగాపూర్ లో వివాహ వేడుకలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మార్గమధ్య కేశవపట్నం లో ఈ ఘోర ప్రమాద ఘటన చోటుచేసుకుందని మృతుని భార్య, పూజ తల్లి బుచ్చమ్మ, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేశవపట్నం ఎస్సై పాకాల లక్ష్మణ్ రెడ్డి తెలిపారు.

## లక్ష్యం"గా నిర్మించారు.... "లక్షణం"గా వదిలేశారు....

*(మొదటి పేజీ తరువాయి)*

కేంద్రం ఆవరణలోశునకాలకు ఆవాసంగా మారింది.మరోపక్క ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వస్తేశిథిలావస్థలో ఉండడం వల్లఎప్పుడు కులుతుందో తెలియని పరిస్థితినెలకొంది.దీంతో వైద్య సిబ్బంది రోగులకు బిక్కుబిక్కుమంటూ వైద్య సేవలు ఇందులోనే కొనసాగిస్తున్నారు. అంగట్లో అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి. ప్రభుత్వంలక్షలాది రూపాయలు వెచ్చించి లక్షణంగా అధికారులు వదిలేశారు. మరి ఇప్పటికైనా నూతనంగా నిర్మించినభవనం సద్వినియోగంలోకి తేవాలనిమండల ప్రజలు కోరుతున్నారు.

# తాగునీటికి ఇబ్బందులు అసలే రావద్దు..

*(మొదటి పేజీ తరువాయి)*

ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పలువురు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీలు ఆయా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు చొప్పదండిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుం డా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కరీంనగర్లో తాగునీటి సరఫరా లో ఇబ్బందులు తలెత్తకుండా కొత్త ట్రాన్స్ఫార్మర్ ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా అధికారులు అంతా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యవసాయ బావులతోపాటు బోర్ వెల్స్, అవసరమైన ట్యాంకర్లను సిద్ధం చేసుకొని ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పాత బావులను వాడవద్దని, అత్యవసరమైతే నీటిని పరీక్ష చేసిన తర్వాతే వాడుకోవాలని సూచించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో తాగునీటికి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రావద్దని పేర్కొన్నారు. మండలాల వారీగా తాగునీటి సరఫరా పై వివరాలు అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తాగునీటి సరఫరా విషయంలో ఎక్కడ ఏ ఇబ్బంది రాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ముందు జాగ్రత్త చర్యలను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలను పకడ్బందీగా తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోండి..

జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ జిల్లాల్లో ఎక్కువ శాతం సిజేరియన్లు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణతో పాటు అబార్షన్లు చేస్తున్న ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి దృష్టి సారించాలని పేర్కొన్నారు. వాటి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఇష్టా రాజ్యంగ అనుమతులు ఇవ్వొద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఇరిగేషన్ ఈఎన్సి శంకర్, జడ్పి సీఈవో శ్రీనివాస్, డిపిఓ రవీందర్ జిల్లా వైద్యాధికారి సుజాత, ఆర్డీవో కే మహేశ్వర్, డి ఆర్ డి ఓ శ్రీధర్, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా అంచనాలను సిద్ధం చేయండి

*(మొదటి పేజీ తరువాయి)*

అవసరాలకు, పెద్దపల్లి జిల్లా ప్రజల త్రాగునీటి అవసరాలకు, ఆర్.ఎఫ్.సి.ఎల్ పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు ఎటువంటి నీటి కొరత రాకుండా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నీటిసరఫరా విడుదల ప్రణాళిక రూపకల్పన కోసం రెండు రోజులలో సంయుక్త సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి సమావేశానికి రాబోయే మూడు నెలల పాటు నీటి సరఫరా చేయడానికి కావాల్సిన ప్రతిపాదనలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, సంపూర్ణ వివరాలతో హాజరు కావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ డీజీఎం రామకృష్ణ, ముర్మూర్ వాటర్ ప్లాంట్ మేనేజర్ సతీష్, రామగుండం ఎరువుల కర్మాగారం ప్రొడక్షన్ డి.జి.ఎం షా, సీనియర్ మేనేజర్ అమోల్ సోనారే, డిఈ ఎస్.వై.పి కీర్తి, మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు ఉన్నారు.

## అపర భద్రాద్రిలో ఆర్డీఓ రివ్యూ మీటింగ్

**సూర్య, ఇల్లందకుంట**



అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఈనెల 15 నుండి 27 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై హుజురాబాద్ ఆర్ డి ఓ రమేష్ బాబు గురువారం అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. బ్రహ్మోత్స వాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చేయవలసిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రతరం కావడంతో భక్తుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయం, చలువ పందిళ్ళు, క్యూలైన్లు , బారికేడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో పరిసరాలను తిరిగి పరిశీలించారు. ముఖ్యంగా శ్రీరామనవమి రోజున స్వామివారి కళ్యాణాన్ని కనులారా తిలకించడానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వీఐపీ, వివిఐపి భక్తుల సౌకర్యార్థం కూలర్లను అలాగే కళ్యాణ మహోత్సవాన్ని కన్నులారా చూడడానికి అక్కడక్కడ ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేసే విధంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎండలు బాగా ముదరడంతో ముఖ్యంగా వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలాగే విద్యుత్ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, తహసీల్దార్ రాణి, రూరల్ సీఐ కిషోర్ ఎస్సై రాజ్ కుమార్ , ఆర్ ఐ నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ మీ తీరు మనిషిని చంపేసి ఆ ఫొటోకు దండం పెట్టినట్లుంది

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

అకాల వర్షాలవల్ల పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు శుక్రవారం వస్తుండటం శుభ పరిణామం. అయితే కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులు అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో దాదాపు 30 లక్షల ఎకరాల్లో తీవ్రంగా పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. కానీ ఏనాడూ రైతులను ఆదుకోని కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికలొస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వస్తుండటాన్ని ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలి. కేసీఆర్ తీరును చూస్తుంటే... మనిషిని తానే చంపేసి... తానే చనిపోయిన మనిషి ఫొటోకే దండేసి దండం పెట్టినట్లుగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కరీంనగర్ జిల్లాకు వస్తున్న కేసీఆర్ ను నేనడుగుతున్నా... మీ హయాంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఏనాడైనా ఆదుకున్నారా?... పోయినేడాది మార్చిలో చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం లక్ష్మీపూర్ వచ్చిన కేసీఆర్... వారం రోజుల్లో నష్టపోయిన రైతులందరికీ వారం రోజుల్లో ఎకరానికి 10 వేలు ఇస్తానని ప్రకటన చేసింది నిజం కాదా? నెలలు గడిచినా అత్యధిక సంఖ్యలో రైతులకు నయాపైసా సాయం అందించని మాట వాస్తవం కాదా?. వడ్లు కొనే నాథుడు లేక వడ్ల కుప్పలపైనే రైతులు గుండెలు పగిలి చనిపోతుంటే కనీసం పరామర్శించని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని పంట పొలాలను సందర్శిస్తున్నారో కేసీఆర్ సమాధానం చెప్పాలని అన్నారు.రాష్ట్రంలో వరి పంట పండిస్తున్న రైతులకు ప్రత్యామ్నాయ పంటలను సూచించకుండా... వరి వేస్తే ఉరి అంటూ కేసీఆర్ చేసిన బెదిరింపులకు భయపడి చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది నిజం కాదా? కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో వ్యవసాయ రంగం నిజంగా అభివృద్ధి చెందితే.... రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మందికి పైగా రైతులు బలవన్మరణాలకు ఎందుకు పాల్పడ్డారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని పదేపదే ప్రచారం చేసిన కేసీఆర్ పాలనలో తెలంగాణలో రైతుల బోరు బావుల సంఖ్య 18 లక్షల నుండి 28 లక్షలకు ఎందుకు పెరిగిందో సమాధానం చెప్పాలి. 10 ఏళ్లపాటు రైతులను పట్టించుకుని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు? రైతులు అసహ్యించుకుంటరానే సోయి లేకుండా ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం రైతులపట్ల మొసలి కన్నీరు కార్చేందుకే వస్తుండటం సిగ్గుచేటు. కేసీఆర్ కు నిజంగా జానదోయమైతే, రైతులపట్ల చిత్తుశుద్ధి ఉంటే... రాష్ట్రంలో రైతుల దుస్థితికి తానే కారణమని ఒప్పుకుని ముక్కు నేలకు రాసి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి కరీంనగర్ కు రావాలి. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతాంగాన్ని కోరేదొక్కటే... బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులను బీఆర్ఎస్ పార్టీ అరిగోస పెడితే... అధికారంలోకి వచ్చిన వెంటనే "రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు 15 వేలిస్తాం... వ్యవసాయ కూలీలకు 12 వేలిస్తాం... వడ్లకు క్వింటాలుకు 5 వందల రూపాయల చొప్పున బోనస్ ఇస్తం. తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లన్నీ మేమే కొంటం.. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకొస్తం... రైతు కమిషన్ ను ఏర్పాటు చేస్తాం"అని హామీలిచ్చి అమలు చేయకుండా చేతులెత్తేసి మోసం చేసిన దుర్మార్గపు పార్టీ కాంగ్రెస్. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు మళ్లీ మొసలి కన్నీరు కార్చేందుకు, దొంగ హామీలిచ్చేందుకు సిద్ధమైనయ్. ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరుతున్నామని అన్నారు.

# బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

## -యువత ఓటు వేయడం మర్చిపోవద్దు -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## -స్వీప్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగిన 2 కే రన్

సూర్య కరీంనగర్ ప్రతినిధి



అర్హులైన వారందరూ బాధ్యతగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కరీంనగర్ స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2 కే రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై 2కే రన్ ను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వాకర్సు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 2కే రన్ అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్ నగర్ చౌరస్తా, కలెక్టరేట్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా సర్కస్ గ్రౌండ్ వరకు ఉత్సాహంగా సాగింది. రన్ లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్ లో పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 30 వేల మంది యువత ఓటు హక్కును నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరంతా తప్పకుండా ఓటింగ్లో పాల్గొనాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటు హక్కు లేని వారు ఉపయోగించు కోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలంతా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్ లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సర్కస్ గ్రౌండ్లో ఓటు హక్కు వినియోగంపై అందరి తో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్వీప్ నోడల్ అధికారి, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మెప్మా పీడీ రవీందర్, ఆర్డీఓ కే మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నతానియల్, ఎన్ వై కే కోఆర్డినేటర్ వెంకట రాంబాబు, బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్, సంక్షేమ అధికారి సరస్వతి, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి జనార్దన్ రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత అంజనా రెడ్డి, మెప్మా డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ అనిత, పలువురు అధికారులు, విద్యార్థులు, వాకర్స్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

సూర్య తిమ్మాపూర్



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మా నగర్ గ్రామానికి చెందిన బొబ్బిలి అఖిల్రిశ్విత వివాహమునకు మానకొండూరు మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ నాయ కులు ఆరేపల్లి మోహన్ గురు వారం నూతన వధూవరులను ఆశీర్వదించారు .ఈ కార్యక్రమంలో అల్లాడి రఘునందన్ రావు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మేముసైతం యువసేన ఫౌండేషన్ ద్వారా

# వృద్ధాశ్రమంలో కూలర్ పంపిణీ

సూర్య కరీంనగర్ ప్రతినిధి



మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎండలు బాగా మండపోతున్న సందర్భంగా వృద్ధాశ్రమంలో కూలర్ పంపిణీ చేయడం జరిగింది. కొమురవెల్లి సాయి తేజ వారి యొక్క సహకారంతో కూలర్ ఇవ్వడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వప్న అన్నారు. ఇలా వృద్ధులకు వారి యొక్క అవసరాల నిమిత్తం కూలర్ డొనేట్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్ రూప, హనురూప్ ,విక్రం రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

సూర్య, వీణవంక



వీణవంక మండల కేంద్రంలోని ఘంట వెంకటయ్య కుమార్తె శైలజ - మల్లేష్ వివాహం గురువారం జరిగింది. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రేణుక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతా శ్రీనివాస్, పోతుల నర్సయ్య, భానుచందర్, తాళ్లపల్లి మహేష్, రాధాకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే

సూర్య సిరిసిల్ల టౌన్

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషించే బాధ్యత వారి పిల్లలదేనని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య,జనపాల శంకరయ్య లు అన్నారు. గురువారం సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘంలో సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చేపూరు బుచ్చయ్య జన్మదినం సందర్భంగా 70 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజనుల బాధితులకు కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం చేస్తామని,అలా కాని పక్షంలో చట్టరీత్యా ఆర్డీవో ద్వారా కేసులు నమోదు చేయిస్తామని అన్నారు. సీనియర్ సిటిజన్లో ఉల్లాసంగా ఉత్సాహంగా జీవనం కొనసాగించాలని,మానసికంగా బాధలకు గురికాకుండా సంతోషంగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీగాద మైసయ్య,ఎనుగుల ఎల్లయ్య,దొంత దేవదాసు, కోడం నారాయణ,కొక్కుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

సూర్య జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించారు శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శని ఆదివారాలు సాధారణ సెలవులు కాగా సోమవారం అమావాస్య సందర్భంగా మంగళవారం ఉగాది పండుగ రోజున సెలవులు ప్రకటించారు ఐదు రోజుల సెలవులు అనంతరం తిరిగి పదవ తేదీ బుధవారం రోజున మార్కెట్ ప్రారంభమవుతుందని మార్కెట్ కార్యదర్శి రెడ్డినాయక్ తెలిపారు గురువారం 45 వాహనాలలో 737 క్వింటాల విడి పత్తి మార్కెట్ కు విక్రయానికి వచ్చింది గరిష్ట ధర 7650 కనిష్ట ధర 7000 మోడల్ ధర 7500 రూపాయలతో వ్యాపారులు కొనుగోలు చేశారు

# పెళ్లిలో పుస్తె, మెట్టెలు పంపిణీ చేసిన కరీంనగర్ పాల డైరీ

సూర్య శంకరపట్నం



శంకరపట్నం మండలంలోని అంబాల్ పూర్ గ్రామంలో గుడిసె రాజయ్య - లక్ష్మిల రెండవ కుమార్తె వివాహానికి కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తె, మట్టెలు అంబాల పూర్ గ్రామ పాల డైరీ కార్యవర్గ సభ్యులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రకాష్, మడ్డి రవి, సదానందం, కుమారస్వామి, జనార్ధన్ రెడ్డి , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం

## -మై వేములవాడచారిటబుల్ ట్రస్ట్

సూర్య వేములవాడ టౌన్



దాతల సహకారంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లి1073 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ముందు, రాజన్న ఆలయ పార్కింగ్ మరియు భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేదలకు, అన్నార్తులకు మరియూ యాచకులకు ప్రతీరోజు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించేదాతలు ట్రస్టు గూగుల్ పే,ఫోన్ పే నం. 8985588060 కు అందిస్తే వారి కుటుంబ సభ్యుల పేర అన్నదానం చేయడంజరుగుతుందనిలి అన్నం పరబ్రహ్మ స్వరూపం అనిలినేటి అన్నదాతలుగాలి వరంగల్ వాస్తవ్యులు సంగె%శీ% ప్రణీత సూర్య ప్రకాష్ దంపతులు, నక్క స్వప్న వేణు దంపతులు, లైన్ నిర్మల నర్సింగ్ దంపతులు, వెంకటరావుపల్లి వాస్తవ్యులు నక్క సంతోష శ్రీకాంత్ దంపతులు లిశాశ్వత దాతలుగాలి జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు ఉన్నారని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు

సూర్య శంకరపట్నం



అంబాల్ పూర్ గ్రామంలో బుధవారం ఎస్సీ కాలనీవాసులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కాలనీలో ప్రతీ ఇంటి మహిళలు బోనం తీసి, డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి శివసత్తుల బోనాలతో తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి, పిల్ల పాపతో అంతా కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.

# రెండు గ్రామాల్లో పోలీస్ కవాతు

సూర్య, హుజురాబాద్ రూరల్



పార్లమెంట్ ఎలక్షన్స్ లో భాగంగా హుజురాబాద్ మండలం కందుగుల, కనుకుల గిద్ద గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ (పోలీస్ కవాతు) గురువారం నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ నందు వాట్సప్ గ్రూపులలో అభ్యంతరమైన మెసేజ్ లు షేర్ చేయకూడదని, ఎలాంటి మీటింగ్ కైనా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని, శాంతియుత వాతావరణం లో ఎలక్షన్స్ జరగాలని హుజురాబాద్ టౌన్ సిఐ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 సిఐఎస్ఎఫ్ ఆఫీసర్స్ , జవాన్లు, ఎస్‌పటి టీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల వార్షిక పరీక్షలు వాయిదా

సూర్య, హుజురాబాద్

2023 - 2024 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించే వార్షిక పరీక్షలు (ఎస్ఏ 2 పరీక్షలు) విద్యాశాఖ వాయిదా వేసింది. ఈనెల 8వ తేదీ నుండి ప్రారంభం కావలసిన ఎస్ఏ - 2 పరీక్షలను ఈనెల 15వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఈ మార్పుతో ఈ నెల 15న ప్రారంభమై 22 తో పరీక్షలు ముగుస్తాయి. తేదీ 23వ తేదీన పరీక్ష ఫలితాలు వెల్లడించాలని విద్యాశాఖ సూచించింది. 15వ తేదీ సోమవారం తెలుగు, 16వ తేదీ మంగళవారం ఆంగ్లము/ హిందీ, 18వ తేదీ గురువారం గణితము/ ఆంగ్లము, 19వ తేదీ శుక్రవారం సామాన్య శాస్త్రము (8, 9 తరగతులకు భౌతిక శాస్త్రము, జీవశాస్త్రములు వేర్వేరుగా నిర్వహిస్తారు), 22వ తేదీ సోమవారం రోజున గణితము/ సాంఘిక శాస్త్రము పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు ఒకటి నుండి ఏడో తరగతి వరకు ఉదయం 9 గంటల నుండి 11.30 వరకు, 8వ తరగతికి 9 గంటల నుండి 11.45 వరకు, 9వ తరగతికి 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఈనెల 20వ తేదీన మాత్రం 8, 9 తరగతులకు రెండు పేపర్లు ఉండడం వల్ల అదనపు సమయం కేటాయించారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

# విహెచ్‌పి ఆధ్వర్యంలో సింగర్ లక్ష్మయ్యకు సన్మానం

సూర్య చొప్పదండి



కేశవ పట్నం లో జరిగిన నందన్ స్మారక భజన పోటీలలో 32 భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. ఇందులో చొప్పదండి శ్రీ హనుమాన్ భజన మండలి తరఫున సభ్యులు పాల్గొని మొదటి బహుమతి ? 10116, బెస్ట్ సింగర్ గా చీకట్ల లచ్చయ్యను ఎంపిక చేసి వారికి ?1116 పారితోషికాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ ఈ సన్మానం మొదటగా మా గురువు పిట్టల నారాయణకు అంకితం చేస్తూ నా పాటకి ఈ రోజు కోరాస్ ఇచ్చినా హనుమాన్ భజన మండలి సభ్యులు డోల్క రాజు వాద్యం, పిట్టల రఘు,పూదరి రాములు, చిలుకూరిలక్ష్మిరాజాం, బత్తులరవి , మొలుమూరి రమేష్ లకు అభినందనలు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించి నాకు సన్మానం చేసిన విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు పడకంటి కృష్ణ కార్యవర్గ సభ్యులు మొలుమురి రమేష్, కటకం మహేష్, సిరిపురం శ్రీనివాస్,దండే లింగయ్య, వడ్లూరి సుధాకర్ , దండే సత్యానంద్, రాజు, అనుమండ్ల సుధాకర్, భజరంగ్ దల్ అధ్యక్షుడు అనుష్ ధన్యవాదాలు తెలిపారు.

## పసుపు బోర్డుపై అసత్య ప్రచారం తగదు

**-40 ఏళ్లలో జగిత్యాల ఏం అభివృద్ధి చెందిందో చెప్పాలి -ఎంపీగా ఓడితేనే మంత్రి అవుతారు అప్పుడైన అభివృద్ధి చేయండి**

**-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి**

**సూర్య జగిత్యాల**

మీ హయాంలో చెరుకు , పసుపు, మామిడి రైతులు నష్టపోయారని రైతులను మభ్యపెట్టి మోసం చేయకండని, పసుపు రైతు కళ్ళలో ఆనందం ఉంటే మీ కళ్ళలో ఎందుకు నిప్పులు చేరుగుతున్నారని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి ని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి మాట్లాడారు.గురువారం జగిత్యాల లోని కమలా నిలయంలో బీజేపీ నాయకులతో కలిసి శ్రావణి విలేకరులతో మాట్లాడారు.అధికారం వచ్చాక మీ ఇంటి ముందు రోడ్డు వేయించుకున్నారు కానీ జగిత్యాల పట్టణ ప్రధాన యావర్ రోడ్డు సంగతి మర్చిపోయారని ఎద్దేవ చేశారు.నేను చైర్మన్ గా ఉన్నప్పుడు యావర్ రోడ్డు 100 ఫీట్లకు గెజిట్ తీసుకువచ్చాము 40 ఏళ్ల రాజకీయంలో మీరు ఏం చేశారని ప్రశ్నించారు. జగిత్యాల గంజాయికి గేట్ వేగా మారిందని,ఆడపిల్లలు ఇంటికి రాత్రి సమయంలో క్షేమంగా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాస్త నోరు అదుపులో పెట్టుకోవాలి, మీరు చదువుకున్న మేధావులు మీరు అదుపుతప్పితే మేము నోరు తెరవాల్సి



ఉంటుందని ఆమె హెచ్చరించారు.భారత దేశంలో ఎక్కడా లేని పిఎఫ్ఐ జగిత్యాల్లో పెంచి పోషించింది మీ హాయంలో కాదా అని శ్రావణి ప్రశ్నించారు.బీడీ కార్మికులకు మీరు 100 రోజుల హామీలో ఇస్తా అన్న 4వేల రూపాయల పెన్షన్ ఇచ్చిన తర్వాత ఈ ఎస్ ఐ హాస్పిటల్స్ గురించి మాట్లాడండని శ్రావణి సూచించారు. బారాస హయాంలో మోసలి కన్నీరు కార్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా అర్వింద్ 2019 లో ఎంపీగా గెలుపొందిన తర్వాత నాలుగున్నర ఏళ్ల కాలంలో ఏకంగా ఆరు ఆర్వోబీలు , ఒక ఆర్ యూ బి మొత్తంగా 7 మంజూరు చేయించారని, అందులో ఆర్మూర్ ప్రాంతంలో ఉన్న గోవింద్ పేట్ ఆర్వోబీ ఏడాది క్రితం ప్రారంభించబడి, ప్రస్తుతం వినియోగంలో ఉందనన్నారు. అదేవిధంగా ఆర్మూర్ మామిడిపల్లి నేషనల్ హైవే దగ్గర్లో ఉన్నటువంటి ఆర్వోబీ మరో నెల రోజుల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. నిజామాబాద్ నగర ప్రజల దశాబ్దాల కల అయిన మాధవ్ నగర్ ఆర్వోబీ , మాక్లూర్ మండలంలోని మామిడిపల్లి వద్ద గల ఆర్వోబీల పనులు గత రాష్ట్ర ప్రభుత్వం అనుమతుల నిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా ఉండి ఉంటే ఈనాటికి ప్రారంభమై ఉండేవని తెలిపారు.మాధవ నగర్ ఆర్వోబీ మాత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 50:50 శాతం వాటా నిధులతో మంజూరైందన్నారు.మోడీ సైనికుడు అరవింద్ ను గెలిపిస్తే కేంద్రమంత్రి అయి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారని అందుకు ప్రజలు ఆశీర్వదించాలని శ్రావణి కోరారు.ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్,పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు,జగిత్యాల పట్టణ మహిళ మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం,పుష్ప రెడ్డి,తిరుపతి,పురేల్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొడిమ్యాల లో సెట్ బ్యాక్ లేకుండా ఇళ్ళ నిర్మాణాలు

**-పట్టించుకోని అధికారులు**

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లో సెట్ బ్యాక్ లేకుండా ఇళ్ళ నిర్మాణాలు చేపడుతున్నారు. కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీ పరిసర ప్రాంతంలో ఆర్అండ్ బీ మెయిన్ రోడ్డు లో ఏ నిర్మాణాలు జరిగిన పూర్తి స్థాయిలో గ్రామ పంచాయతీ అన్ని అనుమతులు తీసుకోని రోడ్డు మధ్యలో నుండి 33 ఫీట్ల సెట్ బ్యాక్ తీసుకొని నిర్మాణాలు చేపట్టాలి కానీ ఇవన్నీ డోంట్ కేర్ మాకేం సంబంధం లేదు అన్నట్లుగా మమ్మల్ని ఆపేది ఎవరు లేరు అనే విధంగా సెట్ బ్యాక్ తక్కువ చేసి నూతనముగా నిర్మాణాలు ఇంటి యజమానులు చేపడుతున్నారు. ఇదంత తెలిసి కూడా సంబంధిత అధికారులు చూసి



చూడనట్లు వ్యవహరిస్తూ ఇది మా పరిధి లో లేనట్టు గా వ్యవహరిస్తూ ఉన్నారు. కొంత మంది గ్రామ ప్రజలు యువకులు సంబంధిత అధికారుల దృష్టికి పదే పదే తీసుక వెళ్ళిన కూడా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోతలేరు అని గ్రామ ప్రజలు యువకులు చర్చించుకుంటున్నారు.గ్రామం లో ఇది పెద్ద సమస్య గా మారి వైరల్ గా మారింది.ఇంత పెద్ద సమస్య వైరల్ గా మారినప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఉంటున్నారు అంటే దీని వెనకాల కొంత మంది పెద్దల హస్తం ఉన్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది కనీసం దీని పై ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆర్అండ్ బీ రొడ్డు మధ్యలో నుండి 33 ఫీట్ల సెట్ బ్యాక్ జరిపి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలి అని గ్రామ అభివృద్ధి కి సహకరించాలని గ్రామ ప్రజలు యువకులు కోరుతున్నారు.

## రేషన్ డీలర్‌పై కేసు నమోదు

**సూర్య మల్లాపూర్**

మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణాల్లో తహసీల్దార్ వీర్ సింగ్ గురువారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో నెం. 2711032 గల రేషన్ షాప్ లో 1.45 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం వుండటంతో డీలర్ కల్లెం లలిత పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..మండల రేషన్ డీలర్ లు ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని రిజిస్టర్ నమోదు కచ్చితమైనదిగా వుండాలని సూచించారు. లేదంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**సూర్య మల్లాపూర్**

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ పబ్బ. కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని సాతారం గ్రామ శివారు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తు రెండు ట్రాక్టర్లు పట్టుబడగా పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గొల్లపల్లిలో గాలికుంటు వ్యాది నివారణ కార్యక్రమం

**సూర్య గొల్లపల్లి**



గొల్లపల్లి మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీం నగర్ నుండి వచ్చిన డాక్టర్స్6 నెలలలోపు వయసు గల 20 పశువుల నుండి రక్త నమూనాలను సేకరించారు. ఇవి పశువులలో గాలికుంటు టీకాలు ఎంతవరకు పనిచేస్తున్నాయి, తల్లి పశువులనుండి పుట్టిన దూడలకి ఈ వ్యాధి కి సంబంధించిన ఎంతవరకు ఆంటిబడీస్ వస్తున్నాయి అని నిర్ధారణ చేయడానికి ఉపయోగపడుతుందని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నన్, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్ డాక్టర్ రవీందర్ గోపాలమిత్ర రవి పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-రేకులపల్లి రవీందర్ రెడ్డి**

**సూర్య కొడిమ్యాల**



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చెస్తూ జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల బిజెపి ఆద్వర్యంలో మండల బిజెపి నాయకులు గురువారం రోజు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాని కోరుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన రైతు దీక్ష మండల పార్టీ కార్యాలయంలో రైతు కోసం దీక్ష చేశారు. ఈ సందర్భంగ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రేకులపల్లి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్న రైతులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. రెండు లక్షల ఋణ మాఫీతో పాటుగా, రైతులకు పెట్టుబడి సహాయం, వరి పంట క్వింటాలుకు 500 బోనస్ లాంటి హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, రాజేశం, సాగర్ రావు, నర్సింహ రెడ్డి, బుచ్చిరాం,నరేష్,రాజు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

**- బిజెపి కిషన్ మోర్చ ఉపాధ్యక్షుడు గడ్డం మల్లేష్**

**సూర్య మెట్‌పల్లి**



శివారు ఆయకట్ట వరకు ఎస్సారెస్పీ నీటిని అందించాలని భారతీయ జనతా కిషన్ మోర్చా మెట్‌పల్లి పట్టణ ఉపాధ్యక్షుడు గడ్డం మల్లేష్ డిమాండ్ చేశారు. యాసంగి పంటలు పొట్ట దశలో ఉన్నాయని ఒక పదిహేను రోజుల్లో కోతకు వస్తాయని ఈ సమయంలో పొలానికి నీరు అవసరం ఉంటుందని నీరు లేకపోవడం తో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు, ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ కెనాల్ నుండి కాలువల ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల దినోత్సవం

**సూర్య జగిత్యాల టౌన్**



తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 1969 తెలంగాణ అమరవీరుల 55వ సంస్మరణ దినోత్సవం జరిపి ఘనంగా నివాళులర్పించారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా సీనియర్ సిటీజేన్స్ ,1969 తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా తొలి,మలిదశ ఉద్యమాల్లో అమరులైన వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు.1956 లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం 1969 లో ఉధృతంగా మారిన ఉద్యమంలో369 మంది మరణించారని తెలిపారు.ఉద్యమ కారుల్లో 70 ఏళ్లపైబడి ఉన్న సీనియర్ సిటీజేన్స్ వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక,శారీరక ఇబ్బందులు పడుతున్నారని ..వారికి ఉచిత వైద్యం,ఉచిత బస్ పాస్,గృహ వసతి కల్పించాలని,పోలీసు తూటాలకు బలైన 369 మంది ఉద్యమకారుల ఒక్కొక్క కుటుంబంకు 25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వంను కోరారు.ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమ కారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 250 గజాల చొప్పున స్థలం ఇస్తామని ప్రజా పాలన దరఖాస్తుల్లో భాగంగా దరఖాస్తులు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,హన్మంత్ రెడ్డి,ఎం.డి.యాకూబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిబంధనలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి

## - సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పెద్దపల్లి శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య అన్నారు.గురువారం పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య మాట్లాడుతూ, మే13న జరిగే పోలింగ్ ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమీషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.గతంలో అనేక మార్లు పోలింగ్ విధులు నిర్వహించినప్పటికీ ప్రతి ఎన్నిక ప్రత్యేకంగా ఉంటుందని, కొత్త నిబంధనలు వస్తుంటాయని, అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా పోలింగ్ నిర్వహణ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత వివిప్యాట్ లో స్లిప్పులను తొలగించాలని, సి.ఆర్.సి తప్పినిసరిగ్గా చేయాలని, పోలింగ్ ముగిసిన తర్వాత కంట్రోల్ యూనిట్లో తప్పనిసరిగా క్లోజ్ బటన్ నొక్కాలని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు పోలింగ్ కేంద్రంలో నమోదవుతున్న పోలింగ్ శాతం వివరాలను అందజేయాలని, పోలింగ్ ముగిసే సమయంలో సంబంధిత నిబంధనలను పాటిస్తూ అవసరమైన రిపోర్టులు అందజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలించి, ఓటరు జాబితాలో ఉన్న అతని వివరాలు చూసుకుని, రిజిస్టర్ లో పేరు నమోదు చేయాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్ కుమార్, పాఠశాల అకాడమిక్ అధికారి పి.ఎం. షేక్, రెవెన్యూ అధికారులు, పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# రామగుండం కమిషనరేట్ షీ టీం పనితనానికి అరుదైన గౌరవం

## -సీపీతో కలిసి కాఫీ విందులో పాల్గొన్న షీ టీం సభ్యులు

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం కమిషనరేట్ షీ టీం ఇటీవల కాలంలో సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో వారికి అరుదైన గౌరవం దక్కింది. ఈ మేరకు గురువారం ఇక్కడి కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన షీ టీం అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులతో కలిసి కాఫీ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ ఉన్నాయని వాస్తవ విషయాన్ని



గమనించాలని కోరారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో రామగుండం కమీషనరేట్ పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సామాజిక మాధ్యమాల విషయంలో మహిళలు జాగ్రత్త గా ఉండాలని సూచించారు. షీ టీం సేవలను అభినందించిన సీపీ మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం చేపడుతున్న చర్యలు, అవగాహన కార్యక్రమాలు, భవిష్యత్తు లో మహిళల రక్షణ కు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు షీ టీం సభ్యులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, పెద్దపల్లి షీ టీం ఇంచార్జ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, మంచిర్యాల షీ టీం ఎస్ఐ హైమా, రెండు జిల్లాల షీ టీం సభ్యులు పాల్గొన్నారు.

# భక్తాంజనేయస్వామి దేవాలయలో జీవద్వజ ప్రతిష్టాపన మహోత్సవం

## -పాల్గొన్న దుద్దిళ్ల శ్రీను బాబు

**సూర్య మంథని**



మంథని మండలములోని ఎక్లాస్ పూర్ గ్రామములో శ్రీ శివ సంచాయతన సహిత భక్తాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో"నవగ్రహ సహిత జీవద్వజ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులకు పాడిపంటలు సకాలంలో పండి అధిక దిగుబడులు రావాలని అభయాంజనేయ స్వామిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం జనార్దన్ రెడ్డి, ఐలి ప్రసాద్, మంథని సత్యం, ప్రభాకర్ రెడ్డి, హనుమాన్ దీక్ష పరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంథని పట్టణంలో చలివేంద్రాల ఏర్పాటు

**సూర్య మంథని**

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంథని మున్సిపాలిటీ లో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవికాలం దృష్ట్యా దాహార్తి తీర్చుకునేందుకు ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు గుండా విజయ లక్ష్మి పాపారావు, చొప్పకట్ల హనుమంతరావు, వికే రవి లు పాల్గొన్నారు.

# మండల బిజెపి అధ్యక్షుడుగా మొలుమురి శ్రీనివాస్

**సూర్య సెంటినరీ కాలనీ**



రామగిరి మండల బిజెపి అధ్యక్షుడుగా మొలుమురి శ్రీనివాస్ ను నియమించినట్లు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మంథని నియోజకవర్గ అన్ని మండలాల అధ్యక్షులను పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడుగా మొలుమురి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రామగిరి మండలం లో బిజెపి పార్టీని బలోపేతం చేస్తూ కేంద్రంలో పేద ప్రజల కోసం అనేక పథకాల ను ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురించి ప్రజలకు వివరించి మండలంలో పార్టీని బలోపేతం చేస్తూ పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. తనను నియమించిన జిల్లా అధ్యక్షులు సునీల్ రెడ్డి కి మండల బిజెపి అధ్యక్షుడు మొలుమురి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# బేస్ బాల్ పోటీలో ప్రతిభ కనబరిచిన బిరుదు మనస్వి

**సూర్య సుల్తానాబాద్**



బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, జిల్లా విద్యాధికారి మాధవిలు సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బిరుదు మనస్విని జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతిని అందజేశారు. సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన బిరుదు మనస్వి చతిస్గడ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగిన అండర్ 14 జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొని అద్వితీయమైన ప్రతిభను కనబరిచడం పట్ల ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు అధినేత నరేందర్ రెడ్డి, డివైఎస్ఓ సురేష్ లు మనస్విని అభినందించారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహాగణపతి హోమం

**సూర్య పెద్దపల్లి**



పెద్దపెల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహాగణపతి హోమం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోత్సవాల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో



మహా గణపతి హోమం నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆది గణపతి ఆశీర్వాదంతో పెద్దపల్లి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

## -జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి

**సూర్య జూలపల్లి**



రైతులు పండించిన తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని దళారులను మోసపోవద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం తేమశాతం 17 ఉండేలా ఆరబెట్టాలని సూచించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ప్రత్యూష, మార్కెట్ సెక్రెటరీ అమిత్, పిఎసిఎస్ సీఈవో గీస సురేష్, ఏఈఓ శ్రీవాణి, తమ్మడవేన మల్లేశం, కరుణాకర్, వంగపల్లి వెంకటరమణ,రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత

## -మంత్రి శ్రీధర్ బాబు చొరవతో...

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ రాష్ట్ర ఐటి ,పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పుల్లెల విష్ణు తండ్రి సదానందం కి రూ.2.50 లక్షల ఎల్ ఓసీ మంజూరు చేసి ఇప్పించారు. రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పుల్లెల విష్ణు గత కొంతకాలంగా క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. క్యాన్సర్ సమస్య తో బాధపడుతున్న పుల్లెల విష్ణు కి ఇటీవల చర్మ సమస్య వచ్చి మరింత ఇబ్బందికి గురిచేసింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి రూ.2.50 లక్షల ఎల్ఓసి ని మంజూరీ చేయించారు. ఎల్ఓసి ని మంజూరు చేపించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబు కి... వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయండి..

## -కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

## -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి-మానకొండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సూర్య మానకొండూరు**

ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే నిర్వాహకులు, అధికారులు వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అంతకంటే తక్కువ ధరకు కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ది హైదరాబాద్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటాడుతూ ప్రభుత్వము ఏ గ్రేడ్ రకం క్వింటాల్ ధాన్యానికి రూ. 2203, సాధారణ రకం ధాన్యానికి రూ. 2183 ధర నిర్ణయించిందని తెలిపారు.



ఈ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించా లని, తద్వారా కనీస మద్దతు ధరను పొందాలని పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తుల దోపిడీకి గురి కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో హమాలీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనిచేయాలని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను వారికి అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వరి ధాన్యానికి తేమ 17 శాతం వచ్చేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, డీసీఎస్ఓ గౌరీ శంకర్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో నర్సయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హాకా ప్రతినిధి లక్ష్మణ్, పలువురు అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసం ఉద్యోగ సాధనలో ముఖ్య భూమిక

**సూర్య, హుజురాబాద్ రూరల్**

ఒక విద్యార్థి యొక్క సాంకేతిక విషయ పరిజ్ఞానం, నైపుణ్యము, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం ఉద్యోగ సాధనలో ముఖ్యమైన భూమికలు పోషిస్తాయని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్ మెంట్ టాస్క్ ట్రైనర్ కే. రమేష్ అన్నారు. గురువారం హుజురాబాద్ మండలం సింగపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కిట్స్ సైబర్ అసోసియేషన్ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఉద్యోగార్తి ఏదైనా ఉద్యోగమునకు విద్యార్థి దరఖాస్తు చేసుకున్నప్పుడు మొదటి దశలో విద్యార్థి యొక్క చదువును పరీక్షిస్తారనీ, ఇందులో ఉత్తీర్ణత పొందిన విషయ పరిజ్ఞానంను పరీక్షిస్తారు, దాని తర్వాత సాంకేతిక పరమైన నైపుణ్యమును



పరీక్షించి విద్యార్థికి ఉద్యోగం ఇవ్వాలా లేదా అని నిర్ణయిస్తారు ఆ తర్వాత విద్యార్థి యొక్క వ్యక్తిత్వము సమస్య సాధన నైపుణ్యము, న్యాయకత్వ లక్షణములను చూసి తుది నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే. శంకర్ మాట్లాడుతూ కిట్స్ సైబర్ అసోసియేషన్ విద్యార్థులలో నైపుణ్యము పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు బృందములుగా ఏర్పడి ప్రాజెక్టు వర్క్ లో ప్రాక్టికల్స్ చేయాలని, సమాజంలో ఉన్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం కనుగొన్న విధంగా సైబర్ అసోసియేషన్ పనిచేయాలని అన్నారు.

**- కిట్స్ సైబర్ అసోసియేషన్ కార్యవర్గం....**

కళాశాల కిట్స్ సైబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పి. అరవింద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా జి. శరణ్య, సెక్రెటరీగా యు. శంకర్, ట్రెజరర్ గా ఎస్. రుత్విక్ రెడ్డి, వి. సచిన్, భరద్వాజ్ లతో పాటు పదిమంది సభ్యులు ఉంటారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త అధ్యాపకుడు పవన్ కుమార్, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

## -సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వి. హనుమ నాయక్

**సూర్య, సెంటినరీ కాలనీ**

పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం మంథని శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి వి. హనుమా నాయక్ అన్నారు. గురువారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జే.ఎన్.టి.యు.హెచ్, యూనివర్సిటి కళాశాల యందు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గల పోలింగ్ మరియు సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వి. హనుమా నాయక్ మాట్లాడుతూ మే13న జరిగే పోలింగ్ ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమీషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో అనేక మార్లు పోలింగ్ విధులు నిర్వహించినప్పటికీ ప్రతి ఎన్నిక



ప్రత్యేకంగా ఉంటుందని, కొత్త నిబంధనలు వస్తుంటాయని, అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా పోలింగ్ నిర్వహణ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత వివిప్యాట్ లో స్లిప్పులను తొలగించాలని, సి.ఆర్.సి తప్పినిసరిగ్గా చేయాలని, పోలింగ్ ముగిసిన తర్వాత కంట్రోల్ యూనిట్లో తప్పనిసరిగా క్లోజ్ బటన్ నొక్కాలని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు పోలింగ్ కేంద్రంలో నమోదవుతున్న పోలింగ్ శాతం వివరాలను సెక్టార్ అధికారులకు అందజేయాలని, పోలింగ్ ముగిసే సమయంలో సంబంధిత నిబంధనలను పాటిస్తూ అవసరమైన రిపోర్టులు అందజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలించి, ఓటరు జాబితాలో ఉన్న అతని వివరాలు చూసుకుని, రిజిస్టర్ లో పేరు నమోదు చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తహశీల్దార్లు ఎం.డి. ఆరీఫోద్దిన్, ఎ.నాగరాజు, బి.రాంచందర్ రావ్, డి. రాజయ్య, మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ మరియు సహాయ పోలింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, ఎలక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులను భయబ్రాంతులకు గురిచేసిన వ్యక్తుల పై కేసు నమోదు

**సూర్య, వీణవంక:**

వీణవంక మండలం పోతిరెడ్డి పల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని గొల్లపల్లిలో బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఆకుల రఘు, ఆశాడపు వినయ్ ల ట్రాక్టర్లు అక్రమ ఇసుక లోడు తో కలిగి ఉండగా అటు వైపు వెళ్ళిన పోలీసులకు కంటపడగనే అట్టి వారిని విచారించగా అక్రమమనే ఒప్పుకోగా పోలీస్ స్టేషన్ కు తరలించాలని చెప్పినప్పటికీ ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులను భయబ్రాంతులకు గురిచేయడం తో చేసేదిలేక ఎస్ఐ కి జరిగిన ఉదంతం వివరించడంతో పై ఇద్దరి ట్రాక్టర్ల యాజమానుల పై కేసు నమోదు చేయగా వినయ్ ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు కు తరలించారు. మరో వ్యక్తి ఆకుల రఘు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తోట తిరుపతి గురువారం తెలిపారు.

# వివాహ వేడుకలకు హాజరైన ప్రణవ్

**సూర్య, వీణవంక**



వీణవంక మండల కేంద్రంలో గంట వెంకటయ్య కుమార్తె శైలజ – మల్లేష్, నర్సింగాపూర్ గ్రామంలోని గిరవేన రవి యాదవ్ కుమార్తె అలేఖ్య – శ్రీకాంత్ ల వివాహాలు గురువారం జరిగాయి. ఈ వివాహ శుభకార్యాలకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి. సాహెబ్ హుస్సేన్, ఎక్కటి రఘుపాల్ రెడ్డి, ఒడ్డపల్లి కొమురయ్య, నల్ల కొండల్ రెడ్డి, కామిడి శ్రీపాల్ రెడ్డి, మసాడి చొక్కారావు, మ్యాక వీరయ్య, పత్తి సమ్మిరెడ్డి, ఉయ్యాల చంద్రమౌళి, సతీష్, సాగర్, అనిల్ రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద చెరువును కాపాడాలని రైతులు,మత్స్యకారులు పెద్ద అధికారులకు విన్నపం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఎలగందుల గ్రామంలోని పెద్ద చెరువును కాపాడాలని గ్రామ రైతులు,మత్స్యకారులు పెద్ద ఎత్తున అధికారులను వేడుకోవడం జరిగింది. పెద్ద చెరువు భూమి శిఖము కబ్జాలకు గురి అవుతున్నది. చెరువులోకి గ్రానైట్ ఫ్యాక్టరీల డస్ట్,కెమికల్స్,చిప్స్,వేస్టు వివిధ వ్యర్థ పదార్థాలు చాలావరకు చెరువులోకి కలిసుమవుతున్నాయి. దీనికి కారణం అధిక సంఖ్యలో ఫ్యాక్టరీలు గ్రానైట్ మాఫియా కారణాలవల్ల చెరువు డస్ట్ వల్ల చెరువు నిండిపోయే పరిస్థితి ఏర్పడనుంది రానున్న రోజుల్లో రైతుల వ్యవసాయ బావులోని నీరు ఎండిపోయే పరిస్థితి రైతులకు నష్టం, అలాగే మత్స్యకారులకు తీవ్ర నష్టం (చేపలు చనిపోయే )పరిస్థితి జరుగుతుంది. కావున తక్షణమే అధికారులు తగిన న్యాయం చేయగలరని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ DE సంతోష్ కుమార్ AE నవీన్ కుమార్ ,fisharish department F.D.O విజయ్ కుమార్, అసిస్టెంటF.D.O మంజుల, మాజీ సర్పంచ్ నిమ్మల అంజయ్య, బైరెడ్డి వంశీ ,ఎన్నం మల్లేశం, బోనాల శంకర్, గస్కంటి రాజు ,జంగిలి రమేష్ ,బోనాల కనకయ్య ,జుట్టు రాజు, గ్రామస్తులు ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

**సూర్య, హుజురాబాద్ రూరల్**

విఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు నిర్వహించగా సోనీ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ హైదరాబాద్ బ్రాంచ్ కి 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు విఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎన్ హనుమ కుమార్, ప్రాంగణ నియామకాల అధికారి తాళ్లపల్లి అజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోనీ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ యాజమాన్యం రణధీర్, రామ్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం జంగంపల్లి గ్రామంలో అంబాల అంకుసమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అతిధి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి తన అనుచరులను పంపించి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్ రెడ్డి యువ సైన్యం వ్యవస్థాపకులు సతీష్, ప్రశాంత్, కర్ణాకర్, శ్రావణ్, అనిల్, గురవరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాకేష్, బీరయ్య, తిరుపతి, రామస్వామి, అజయ్ కుమార్, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపడితేనే ప్రమాదాలను నివారించగలుగుతాం

## -అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండండి -రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు

**సూర్య గోదావరిఖని**

ఫైర్ సేఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా జనావాసాల మధ్య ఉన్న అపార్ట్మెంట్‌లు, గోడౌన్లు, స్టోర్స్, ఇతర కమర్షియల్ సముదాయాల వాటిపై కూడా తరచుగా అధికారులు తనిఖీలు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఇక్కడి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల ఫైర్ శాఖ అధికారులు, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్ సిఎల్ తో పాటు వివిధ పరిశ్రమల కు చెందిన ఫైర్ సేఫ్టీ అధికారులతో సీపీ ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏదైనా అగ్ని ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే పరిధితో సంబంధం లేకుండా దగ్గర లో ఉన్న ఫైర్ స్టేషన్ సిబ్బంది, అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదం జరిగిన దగ్గర లో ఉన్న వాటర్ సోర్స్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదం జరిగిన ప్రదేశం యొక్క భౌగోళిక పరిస్థితులు తెలుసుకొని దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని వివరించారు. భారీ, ఎత్తయిన భవనాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హాస్పిటల్ లు, పాఠశాలలు, అపార్ట్‌మెంట్లలో తనిఖీలు చేపట్టాలని, మున్సిపల్, పోలీస్, ఫైర్, తదితర శాఖల అధికారులు సమయన్వంతో పని చేస్తూ.. నిర్ణీత కాలంలో తనిఖీలు పూర్తిచే యాలని చెప్పారు. ముఖ్యంగా హాస్పిటల్, పాఠశాల భవనాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాములు, వాణిజ్య భవనాలు, ఎత్తయిన అపార్టుమెంట్లలో తప్పనిసరిగా తనిఖీలు చేపట్టాలని అన్నారు. ప్రతి అపార్ట్మెంట్లో, షాపులలో, ఇండ్లలో ఉన్న స్థలాలకు అనుగుణంగా ఫైర్ రెసిస్టెన్స్ పరికరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలకు భద్రత కల్పించడమే తమకు అత్యంత ముఖ్యమైన అంశమని, ఇందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ తనిఖీల్లో సహకరించని, నిబంధనలు పాటించని వ్యాపార, వాణిజ్య సంస్థలపై చట్ట పరిధిలో చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంప్లెక్స్ భవనాల్లో సామర్థ్యానికి మించి వస్తువుల నిల్వ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొన్ని భవనాల్లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో షాపులు, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ప్రమాద కరమైన వస్తువులు నిల్వ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది కచ్చితంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వేసవికాలంలో వేడి వలన, నాణ్యతలేని ఎల క్ట్రిక్ వైర్లను వాడడం ద్వారా షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదాలు జరిగే అవ కాశం ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండి ప్రజల భద్రతకు కలిసి పని చేయాలని సీపీ అగ్నిమాపక అధికారులను కోరారు. ఈ సమావేశంలో కమిషనరేట్ అడిషనల్ డిసిపి (అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు,గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్ కుమార్, మంచిర్యాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ దేవేందర్, బెల్లంపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎస్ టిపిపి జైపూర్ సేఫ్టీ ఆఫీసర్ సురేష్, రమేష్ కుమార్, శ్రవణ్ కుమార్, పెద్దపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, మంథని ఫైర్ స్టేషన్ ఇంచార్జ్ ఆఫీసర్ సదానందం, గోదావరిఖని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, కేశోరామ్ సిమెంట్ ఫ్యాక్టరీ సేఫ్టీ ఆఫీసర్ మల్లికార్జున్, హెచ్ఆర్ మేనేజర్ శ్యాంసుందర్, ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ ఆదేష్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ ఏవిఏన్.రెడ్డి, ఆర్ఎఫ్ సిఎల్ సేఫ్టీ ఇంచార్జ్ సత్యనారాయణ, సేఫ్టీ ఆఫీసర్ గోపాల్ కుమార్, సింగరేణి రెస్క్యూ ఆఫీసర్ బింగి మాధవరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.







# త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

## -వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వి కర్ణన్

**సూర్య రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేసవి కాలంలో త్రాగు నీటికీ ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తూ తగిన చర్యలు చేపట్టాలని ఉమ్మడి కరీంనగర్ ప్రత్యేక అధికారి, వైద్య , కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వి కర్ణన్ అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరెట్‌లోని సమావేశ మందిరంలో వైద్యం,కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వి కర్ణన్ , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఖీమ్యా నాయక్ లతో కలిసి వేసవికాలంలో త్రాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ,మండల, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ వేసవికాలంలో త్రాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సంక్షోభ సమయంలోనే మన పని తీరు పరీక్షకు గురవుతుందని, మిషన్ భగీరథ అధికారులు,మండల పరిషత్,జిల్లా పరిషత్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్రాగునీటి వ్యవస్థ, మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం అందుతున్న త్రాగునీటి సరఫరా ఇతర వివరాలను మండలాల వారీగా ఆయన సమీక్షించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు గాను పూర్తి స్థాయిలో త్రాగునీటి సరఫరాకు ప్రతి రోజూ 27.81 ఎం.ఎల్.డిలు, గ్రామీణ ప్రాంతాల్లో 43.45 ఎం.ఎల్.డిల నేటి డిమాండ్ ఉందన్నారు. ప్రస్తుతం 35.59 ఎం.ఎల్.డి నీటి సరఫరా మిషన్ భగీరథ ద్వారా జరుగుతుందని, మిడ్ మానేర్ డ్యాం లో 7.72 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నందున మిషన్ భగీరథ ద్వారానే ఇంటింటికి త్రాగు నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంచాలకులు సూచించారు. వేసవి దృష్ట్యా ఉష్ణోగ్రతలు తీవ్రంగా రోజు రోజుకు పెరుగుతున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో కొరత ఏర్పడే అవకాశం ఉందని, అప్పుడు స్థానికంగా ఉన్న ఇతర నీటి వనరులు వినియోగించాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వద్దకు ముందుగా నీరు చేరుకునే విధంగా చూడాలని అన్నారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రతి ఇంటికి సమృద్ధిగా త్రాగునీరు సరఫరా చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాల్టీలలో ఉన్న బోర్ బావులు, పంపులు, స్థానిక నీటి వండులను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేసామని తెలిపారు.త్రాగునీటి సరఫరాను ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నామని అవసరమైన మేర సిబ్బందిని నియమించామని, భూగర్భ జలాల నీటి స్థాయిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని జిల్లాలో అవసరమున్న వారికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు.అనంతరం అగ్రహారం లోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ సందర్శించి మోటర్ల పని తీరు ను పరిశీలించారు.సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎన్.ఖీమ్యా నాయక్, జిల్లా పరిషత్ సీఈవో ఉమారాణి, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈ లు జానకి, విజయ్, భూగర్భజల శాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, ఎంపీడీవోలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

## -పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో కఠోరమైన ఉపవాస దీక్షను చేపట్టి భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి లంక సదయ్య,జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మునీర్. మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు బంగారు రమేష్, అల్లం దేవేందర్, బాల సమ్మయ్య, మాదాసు సతీష్, పొట్యాల మొండయ్య, అరెల్లి రమేష్, రానవెన శ్రీనివాస్, పోచాల సదానందం, మొగిలి సదానందం, ఎండి కలిముద్దీన్, ఎండి సజ్జు,గీసరాజు,మేడి అశోక్ గౌడ్,రానవేన క్రాంతి, కాల్వ వేమారెడ్డి, సబ్బని రాజమల్లు,సోన్నాయి టెంకం శివరామకృష్ణ, నేదురు రమేష్, రానవెన రవి, గాజుల మోహన్,పల్నాటి రాజిరెడ్డి, ఆవుల రాములు, పాల రాజేశం, తాండ్ర సురేష్, ఎనగంటి రవి, ముస్లిం సోదరులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత ప్రమాదకరంగా మారిన గుంతలు

**సూర్య, ఇల్లందకుంట**



ఇల్లందకుంట మండల కేంద్రంలో వృద్ధాశ్రమం మలుపు వద్ద రహదారిపై ఏర్పడ్డ గుంతలు అత్యంత ప్రమాదకరంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా తయారయ్యాయి. ఇల్లందకుంట లోని ఈ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 15 నుండి 27 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎవరైనా భక్తులు ఈ గుంతలలో పడి ప్రమాదానికి గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బాధ్యతగా యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# జ్యూస్ సెంటర్లో కేటీఆర్ - విద్యార్థులతో ముచ్చట్లు

**సూర్య రాజన్న సిరిసిల్ల**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు గురువారం సిరిసిల్ల పట్టణంలోని ఒక జ్యూస్ సెంటర్లో సందడి చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ పర్యటనలో భాగంగా పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక పాత బస్టాండ్ లో బిఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ నిర్వహిస్తున్న జ్యూస్ సెంటర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల విద్యార్థినిలతో ముచ్చటించి వారితో కలిసి జ్యూస్ తాగారు. అంతకుముందు కేటీఆర్ సిరిసిల్ల మండలం జగ్గారావు పల్లెలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న టిఆర్ఎస్ నేత కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి అన్న కుమారుడి వివాహం ఇటీవల జరగగా వారి ఇంటికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు.

మున్సిపల్ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్,పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కేటీఆర్ తోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మోడీ పాలనలో దేశంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి

## -కెసిఆర్ చేసిన అప్పులను రేవంత్ తీరుస్తున్నారు -పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి



**సూర్య, రాయికల్**

మోడీ పాలనలో దేశంలో నిత్యవసర సరుకులు ఆకాశాన్నటాయని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ మండల కేంద్రంలోని శివాజీ ఫంక్షన్ హాలులో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు,బీ అర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరగా,కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమోడీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి,పదేళ్ల లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు.విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకు వచ్చి, ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని చెప్పి,ఒక్క రూపాయి ఖాతాల్లో జమ చేయలేదని విమర్శించారు.మోడీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి,ప్రజా సంక్షేమం విస్మరించారు అని అన్నారు.నిత్యావసర ధరల పెరుగుదలకు మోడీ పాలనే కారణం అని, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ బ్యారెల్ ధర 105 ఉంటే పెట్రోల్ రూ.70, డీజిల్ రూ.50 ఉండేదని,ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ బ్యారెల్ ధర 70డాలర్లు ఉంటే, పెట్రోల్ రూ.110, డీజిల్ రూ.100 ఉన్నదన్నారు.పెట్రోల్, డీజిల్ పెరుగుదలకు మోడీ పాలన వైఫల్యమే కారణమన్నారు.యూ పీ ఏ పాలనలో రైతులను రుణ విముక్తి చేసేందుకు 70 వేల కోట్లు నిధులు కేటాయించారని గుర్తు చేశారు.రైతులకు రుణ మాఫీ చేస్తేోమరిపోతులు అవుతారంటు, బడా వ్యాపారస్తులకు లక్షల కోట్లు మాఫీ చేశారని ఆయన విమర్శించారు.వ్యవసాయ ఉత్పత్తులను చట్టబద్ధత కల్పించడం లేదని,దేశ సరిహద్దుల్లో రైతులు ధర్నా చేస్తే,750 మంది రైతులను పొట్టన బెట్టుకున్నరు అని ఆయన అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన అప్పులను ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి తీరుస్తున్నారని గత ప్రభుత్వంలో ఉన్న పెండింగ్ లో ఉన్న సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సీఎం రేవంత్ ఆర్థిక చేయూతను అందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెళ్లి చేసుకున్న ప్రతి ఆడబిడ్డకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం కచ్చితంగా అందజేస్తామని ఆయన అన్నారు.రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేస్తూ తమ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు రవీందర్రావు, మహేందర్ గౌడ్,పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజ రెడ్డి, కౌన్సిలర్ మ్యాకల అనురాధ,మాజీ జెడ్పిటిసి గోపి మాధవి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కొడిపెల్లి ఆంజనేయులు,మున్ను,గంగారెడ్డి,దివాకర్ రెడ్డి సుధీర్ రెడ్డి,షాకీర్,రమేష్,నర్సయ్య, పట్టణ కామ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో50వ రోజుకు చేరిన ఉచిత అల్పాహారం



**సూర్య -కోరుట్ల**

లయన్స్ ఇంటర్నేషనల్ డీస్ట్రిక్ 320G వారు నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా గురువారముతో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరట్ల వారి ఆధ్వర్యంలో కోరుట్ల లోని సివిల్ హాస్పిటల్ ఆవరణలో వరుసగా 50 వ రోజు ఉచిత అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో భాగంగా క్లబ్ తరపున ప్రతీ రోజు సుమారు 150 మంది కి హాస్పిటల్ ఆవరణలో ఉచిత అల్పాహారం అందివ్వడం జరుగుతోంది.ఈ సంధర్భంగా క్లబ్ అధ్యక్షులు లయన్ వనపర్తి చంద్ర మోహన్ మాట్లడుతూ రోజూ ఉచిత అల్పాహారం అందివ్వడం వల్ల రోజూ ఆసుపత్రికి వచ్చే వారు, అందులో అడ్మిట్ అయినవారు, వారి వెంట ఉండే వారు అందరికి ఉపయోగం కలుగుతుందని అందరూ కూడా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా హంగర్ రిలీఫ్ కోర్ టీమ్ మెంబర్ లయన్ ఉషా కిరణ్ ఎలిమిళ్ల మాట్లడుతూ ప్రస్తుతం రోజూ ఉదయం అల్పాహారం అందిస్తూ భవిష్యత్తు లో మధ్యాహ్నం భోజనం కూడా అందించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ప్రతి రోజూ కూడా ఎవరైనా దాతలు వారి వారి పుట్టినరోజు కానీ, పెళ్ళి రోజు కానీ ఏదైనా ఇతరత్రా సందర్భాన్ని పురస్కరించుకొని ఇట్టి కార్యక్రమంలో తమ వంతు ఆర్థిక సహాకారం కేవలం 2000 రూపాయలు అందించి ఇట్టి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వనపర్తి చంద్ర మోహన్, కుందారపు మహేందర్, ట్రేసరర్ కొండబత్తిని అనంత కృష్ణ ప్రసాద్ కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వనపర్తి చంద్ర మోహన్ ,ఇల్లెందుల వెంకట రాములు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఉచిత అల్పాహార కార్యక్రమం కూడా దూరం నుండి ఆసుపత్రికి వచ్చే వారికి ఇక్కడ అడ్మిట్ అయినవారికి చాలా ఉపయోగ కరంగా ఉంటుందని , భవిష్యత్ లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని వారు అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి

## కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు దక్కని ఎంపీ టికెట్



**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గురువారం రోజు ఎమ్మార్పీస్ అఖిలపక్షాల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ తెలంగాణలో 17 పార్లమెంటు స్థానాలు ఉంటే ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మాలల పార్టీగా మారింది ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తన మాల కులస్తులకే ఎంపీ సీట్లు కేటాయిస్తున్నారు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా మాల చేతిలో బందీ అయ్యాడు. మాదిగ జనాభా 75 శాతం ఉన్న ఇవ్వవలసిన మూడు స్థానాలలో కనీసం రెండు సీట్లు కూడా కేటాయించకుండా మాదిగలను అనిచివేతకు గురి చేస్తున్నారు. తన ప్రారంభ రాజకీయ జీవితం నుంచి మాదిగలకు నేను అండగా ఉంటా వారి సామాజిక న్యాయాన్ని గెలిపించే దిశగా అడుగులు వేస్తాం అంటూ మా సామాజిక వర్గాల ఓట్లను తన పార్టీ వైపు మలుచుకునేందుకే ఎన్నో ఎత్తుగడలు వేసినట్టుగా కనిపిస్తుంది.నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు ఎదిగిన మాదిగలకు సామాజిక న్యాయాన్ని అందిస్తాము అండగా ఉంటాము అన్నమాట మరిచి నేడు మాదిగలకే సీట్లు లేకుండా చేసి , మాదిగ నాయకులను ఊరిస్తున్న వైనం కనబడుతుంది. ఖబర్దార్ సీఎం రేవంత్ రెడ్డి మా మాదిగల అణచివేతకు గురి చేస్తున్న మీ కాంగ్రెస్ పార్టీని ప్రస్తుత పార్లమెంట్ ఎలక్షన్ లలో చిత్తు చిత్తుగా ఓడిస్తామని అన్నారు... ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సురుగు శ్రీను (జగన్) వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్, బిఆర్ఎస్ పట్టన అధ్యక్షులు కొత్తూరు స్వామి, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు పర్లపల్లి ప్రభుదాస్, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నేరెళ్ళ మహేష్, పర్లపల్లి ఆనందం, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి బెజ్జం సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బోల్లే అనిల్, మండల అధ్యక్షులు ఎలగుర్తు రవి, బి.ఎస్.పి మండల ఉపాధ్యక్షులు పెంట మల్లేష్, బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు నరేష్ , మండల నాయకులు అంజి, సంతోష్, నరేష్ సంజీవ్ పాల్గొన్నారు.

# కోరుట్ల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పెద్దెల్లి ప్రకాష్

**సూర్య -కోరుట్ల**



రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కోరుట్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ గా టిపిసిసిసెక్రటరీ పెద్దల్లి ప్రకాష్ ను, నియమించినట్లు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినారు, కాగా తన నియామకానికి కృషిచేసిన సీఎం రేవంత్ రెడ్డి కి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ్ రావు లకు ప్రకాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో నిజాంబాద్ ఎంపీగా జీవన్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థిని సన్మానించిన జువ్వాడి నర్సింగరావు

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామనికీ చెందిన కుమ్మరిపెల్లి కార్తిక్ న్యూ విజన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతూ అదే పాఠశాలలో నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం కోచింగ్ తీసుకుని సీటు సాధించడం తో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వడి నర్సింగారావు గురువారం విద్యార్థిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి మండల సేవాదళ్ అధ్యక్షులు నాంపల్లి వెంకటాద్రి, నాయకులు సత్యం, ఆనంద్, శేఖర్ రెడ్డి ,రమేష్ పాఠశాల కరస్పాండెంట్ గుమ్మల తిరుపతి, నాగేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం

**సూర్య-కోరుట్ల**



కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికల్లో గెలుపొందిన తన్నీరు శ్రీనివాసరావును కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్ వాసులు గురు వారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు కు పూల మొక్క అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పసుల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీనివాస రావు పేదలకు ఉచిత న్యాయ సలహాలు, సేవలందించడంలో ముందున్నారన్నారు. ఆయనను ఈ ఎన్నికల్లో గెలిపించిన ప్రతి న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు మారంపల్లి నర్సయ్య, బొల్లె గంగాధర్, కోడి పెల్లి సురేష్, వంక గంగాధర్, తాళ్లపల్లి శేఖర్ ఉన్నారు.

# నిరుపేద యువతి వివాహనికి అండగా నిలిచిన యూత్ నాయకులు

**సూర్య,రాయికల్**



మండలంలోని భూపతిపూర్ గ్రామంలో నిరుపేద యువతి వివాహానికి గ్రామ యువజన సంఘాల నాయకులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు.విజేత యువజన సంఘం సభ్యులు 5000/- ఆర్థిక సహాయం,అనుపథ యూత్ సభ్యులు 25 కేజీ ల బియ్యాన్ని అందించారు.ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ మాట్లాడుతూ యువతి వివాహానికి ఆర్థిక సహాయం అందించటం చాలా గొప్ప విషయమని,ప్రతి ఒకరు స్తోమతకు తగిన సహాయం ఇతరులకు చేయాలని,సహాయం చేయటానికి డబ్బే కొలమానం కాదు అని, సహాయం చేయాలన్న ఆలోచనే చాలా గొప్పదని ఆయన అన్నారు.విజేత,అనుపథ యూత్ వారికి యువతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజేత యూత్ అధ్యక్షుడు సోమ రమేష్, యూత్ సభ్యులు, రఘునందన్,ఆనంద్,రమేష్ బాబు,ప్రసాద్,ప్రహ్లాద హరీష్,సంతోష్ గౌడ్,శేఖర్,సతీష్,నరేష్,లక్ష్మిరాజం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగాముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**సూర్య మల్యాల**



మల్యాల మండలం కేంద్రంలో కొత్తపేట వాడలోని ముత్యాల పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు మంచిర్యాలకు చెందిన ప్రముఖ అర్చకులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి యంత్ర ప్రతిష్ట విగ్రహ ప్రతిష్ట ప్రాణ ప్రతిష్ట పోతురాజు విగ్రహ ప్రతిష్ట తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి చొప్పదండిఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మల్యాల జెడ్పిటిసి కొండపలకల రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానకార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిప్రసాదాన్ని స్వీకరించారు

# వైద్య చికిత్సలకోసం ఎల్ఓసి అందజేసిన ప్రణవ్ బాబు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లికి చెందిన దాసరి సురేందర్ కుమారుడు శరత్ చంద్ర వైద్య చికిత్స సహాయం కోసం ఎల్ఓసి ని గురువారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అందజేశారు. బోర్నపల్లి కి చెందిన శరత్ చంద్ర ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆయన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం ప్రణవ్ బాబుకు తెలుపగా వెంటనే ఆయన 80,000 రూపాయల ఎల్ఓసి ని తండ్రి సురేందర్ కు అందజేశారు.

# మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలను భూస్థాపితం చేస్తాం

**సూర్య సిరిసిల్ల టౌన్**

మాదిగలను అవమానించిన కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ధ్వజమెత్తారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అవునూరి ప్రభాకర్ మాదిగ,ఎమ్మెస్పి సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగలు మాట్లాడుతూ పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన



మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందన్నారు.రేవంత్ రెడ్డి మాలలకు భయపడి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. దళితుల్లో 20% ఉన్న మాలలకు రెండు సీట్లు కేటాయించి ఊరుకొక్కరు లేని బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చిన రేవంత్ రెడ్డి దళితుల్లో 75% గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నీటిని భూస్థాపితం చేశామని కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలమంతా ఏకమవుతామని అన్నారు.ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా పది రోజుల పాటు నిరసన కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల కన్వీనర్ ఆకారం రాజు, ఇల్లంతకుంట మండల కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్ మాదిగ,రుద్రంగి మండల కన్వీనర్ బడుగు సంజీవ్ మాదిగ,కో కన్వీనర్ దయ్యాల నారాయణ మాదిగ, చెందుర్తి మండల నాయకులు తుంటి వెంకటి మాదిగ,అర్జున్ మాదిగ,ఆకారం దేవరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల పట్టణంలో విలీన గ్రామమైన ఏకిన్పూర్ లో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ మడేలమ్మ ,కేతమ్మ సహిత శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంగళ వారం ఉత్సవమూర్తుల యొక్క శోభాయాత్ర ,అఖండ దీపారాధన ,బుధవారం స్థాపిత దేవతా పూజ రుద్ర హోమం ద్వాదశ కలశ స్థాపన నిర్వహించగా గురువారం స్థాపిత దేవతా పూజ నిర్వహించి, శ్రావణ నక్షత్ర యుక్త వృషభ లగ్న శుభమూర్తమున యంత్రస్థాపన మూలమూర్తుల విగ్రహ స్థాపన తోపాటు శాంతి కళ్యాణాన్ని నిర్వహించి, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఈనెల 21 ఆదివారం జాతర, బోనాల పండుగ మహోత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, వార్డు ప్రజలు తెలిపారు. ఈ బోనాల పండుగ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల అందజేత

**సూర్య - కథలాపూర్**



మండల కాంప్లెక్స్ లెవెల్ క్విజ్ పోటీలను విద్యార్థులకు గురువారం మండలంలోని భూషణ్ రావు పేట లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయుడు అర్జున్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే మేధశక్తి ని వెలికతీసేందుకు ఈ క్వి జ్ పోటీలను మండల పరిధిలోని కాంప్లెక్స్ పాఠశాల ల విద్యార్థులకు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి ఊటుపల్లి, ద్వితియ బహుమతి పోసానిపేట, తృతీయ బహుమతి దుంపేట పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఆనందరావు, ఎ ఎం వో రాజేష్, మండల నోడల్ అధికారి శ్రీనివాస్ లు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహ కాన్ని గ్రామస్తులు జవుడి సంతోష్ రెడ్డి, ముస్కం శ్రీనివాస్ రెడ్డి లు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్ల పరిషద్ పాఠశాలల చింత కుంట, అంబారీ పేట, కథలా పూర్, ప్రాదానోపాధ్యాయు లు రవి, కిషన్ రావు, మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాతకొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు, మామిడి పెల్లి శ్రీనివాస్ రెడ్డి, అల్లే పరమేశ్వర్, కృష్ణారావు, రవి, రాజశేఖర్, సాయి దివ్య, నాగరాణి, అరుణ, విద్యార్థులు ఉన్నారు.

## గడ్డం వంశీ కృష్ణను భారీ మెజారిటీతో గెలిపిస్తం

**- మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో ఆయన గెలుపు నల్లేరుపై నడకే.**

**-రామగిరి మండలం ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రానున్న పార్లమెంట్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపి అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తామని రామగిరి ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పేర్కొన్నారు. రామగిరి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆధ్యరంలో ఆయన అండదండలతో, స్థానిక ప్రజాప్రతినిధుల, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. గతంలో దివంగతనేత, పితృసమానులు, ఉమ్మడి రాష్ట్ర శాసన సభాపతి శ్రీపాదరావు ఆధ్యర్యంలో కాకా వెంకటస్వామి ని గెలిపించుకున్నామని, శ్రీపాదరావు హయాంలో వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల ప్రకారం ఆయన నేతృత్వంలో పెద్దపెల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణని గెలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

## అంగన్వాడి ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ వేడుకలు

**సూర్య,రాయికల్**



ఐసిడిఎస్ జగిత్యాల ప్రాజెక్ట్ రాయి కల్ మండలం లో ని ఇటిక్యాల అంగన్వాడి 2,4,5 సెంటర్ల ఆధ్వర్యంలో ప్రీస్కూల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్ర మంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు సున్నా నుండి ఐదు సంవ త్సరాల పిల్లల తల్లులకు ప్రీస్కూల్ కార్యక్రమాల గురించి,ఈవెంట్స్ గూర్చి అవగాహన కల్పించారు.ఐదు నెలల గర్భిణీలకు శ్రీమంతాలు, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్య క్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ పార్వతి,సుజాత, ఎం బుజ్జమ్మ, ఏ.అనురాధ,ఆయాలు,మహిళలు, బాలింతలు గర్భిణీలు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సూర్య ఓదెల**

ఓదెల మండలంలోని కొలనూర్, పోత్కపల్లి , ఓదెల గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కనీసం మద్దతు ధర ఏ గ్రేడ్ 2203/ -సాధారణ రకం 2183 /- ధర కలదని కావున రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త, తాలు, మట్టి పెడ్డలు, రాళ్లు రాకుండా శుభ్రపరిచి మార్కెట్ కు తీసుకురావాలని ఆయన అన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, డిపిఎం రవి, ఏపీఎం లత మంగేశ్వరి ,విజయ, రాజకుమారి, మల్లయ్య, కొమురయ్య, ఆపరేటర్లు పవన్ కుమార్, అకౌంటెంట్ భవాని, కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు.

**-పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**సూర్య, రాయికల్**



బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లోకి భారీగా నాయకులు చేరారు. వివిధ గ్రామాల మాజీ సర్పంచులు,బీఅర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరగా,కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.మాజీ సర్పంచ్ లు తాట్లవాయి రాగి సాగరిక శ్రీనివాస్,అలియా నాయక్ తండ నందు నాయక్,చెర్ల కొండాపూర్ ఆకుల లక్ష్మీనారాయణ,కిష్టంపేట్ జాన స్వరూప గోపి, వీరాపూర్ దిండిగాల రామస్వామి,రాయికల్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఇంతియాజ్,పద్మశాలి సంఘం అధ్యక్షులు తాటిపాముల విశ్వనాథం,గౌడ సంఘం, శాలివాహన వడ్డెర,మేరు,గంగపుత్ర సంఘం కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ నాయకులు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మ్యాకల అనురాధ రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,మండల అధ్యక్షులు రవీందర్ రావు,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యేడి మహిపాల్ రెడ్డి, బాపూరపు నరసయ్య,నాయకులు గోపి మాధవి,ఎద్దండి దివాకర్,దాసరి గంగాధర్, మున్నా,షాకీర్,కడకుంట్ల నరేష్,బత్తిని భూమయ్య,రాకేష్, కోడిపెల్లి ఆంజనేయులు, కాటిపల్లి గంగారెడ్డి,కొమ్ముల ఆది రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత మహాగర్జనను విజయవంతం చేద్దాం

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుండి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈనెల 6న తలపెట్టిన చేనేత మహాగర్జన సభను విజయవంతం చేయాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈరోజు సిరిసిల్ల కార్మిక వాడల్లో ప్రచారం చేపట్టారు.సిరిసిల్ల నేతన్నల ఆకలి కేకలను ప్రభుత్వానికి వివరిస్తూ ఏప్రిల్ 6న సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే నేతన్నల మహా గర్జన సభను విజయవంతం చేయాలని గురువారం సిరిసిల్ల పట్టణంలో వస్త్ర పరిశ్రమ అనుబంధసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక నేతన్న చౌరస్తా నుండి ప్రచారం చేపట్టారు.నేతన్న విగ్రహానికి పూల మాలలు వేసి పాదయాత్రగా కార్మిక వాడల్లో తిరుగుతూ 6న జరిగే మహా గర్జన సభను విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి,రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను ఏమాత్రం ఆదుకోలేదని అన్నారు.గత మూడు నెలలుగా కార్మికులకు పని లేక రోడ్డున పడ్డారని ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలు పునరావృతం అవుతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పంతాలకు పోకుండా ఇక్కడి వస్త్ర పరిశ్రమ కు అనుబంధంగా ఉన్న అన్ని రంగాల కార్మికులను ఆదుకునేందుకు ఆర్డర్లను ఇవ్వాలని, త్రిఫ్ట్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.వీటన్నింటిని సాధించుకునేందుకు ఈనెల 6న సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం జరిగే నేతన్నల మహా గర్జన సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ముషం రమేష్, పంతం రవి, మండల సత్యం, వెల్డండి దేవదాస్,గోవింద్ రవి,తాటిపాముల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరవై రెండవ సారి రక్త దానం చేసిన కాయిత రాజు

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య అనే వృద్ధునికి అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం అత్య అవసరం ఉండడంతో కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీని యర్ నాయకులు కాయిత రాజు గురువారం రోజు కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుని వద్ద కు వెళ్లి రక్తదానం చేశారు. కాయిత రాజు ఇప్పటి వరకు ఇరవై రెండు సార్లు రక్త దానం చేశారు. దీంతో మండలం లోని పలువురు ప్రముఖులు కాయిత రాజును అభినందిస్తు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి అని రాజు చేసిన సేవలను గుర్తు చేశారు.

## ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

యు.పి.ఎస్.సి. - సి.ఎస్.ఏ.టి పరీక్ష కోసం వందమంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించనున్నట్లు మైనారిటీ అభ్యర్థులు ఏప్రిల్ 12వ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 3 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.యుపిఎస్సి (సిఎస్ఏటి -2025) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ / ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఆన్‌లైన్ %షష్.ఎతీవఉర్వశ్రీఖఅస్త్రుఖ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% అనే వెబ్ సైట్ ద్వారా ఏప్రిల్ 12 లోగా దరఖాస్తులు చేయాలని, స్క్రీనింగ్ టెస్ట్ ఏప్రిల్ 28న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, రంగంపల్లిలో నిర్వహించబడుతుందని, అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 040-23236112 లో పని రోజుల్లో సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

## - మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్

**సూర్య, హుజురాబాద్**

ప్రజలందరికీ హక్కులు, బాధ్యతలు కలిగించిన రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. గురువారం రాత్రి హుజురాబాద్ పట్టణానికి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర హన్మకొండ నుండి హుజురాబాద్ కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం మూల స్తంభాలుగా ఉన్న రాజ్యాంగాన్ని కొంత మంది మార్పు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాజ్యాంగంలో మౌళిక సూత్రాలు ధ్వంసం అయితే మనం జీవించే హక్కు, మాట్లాడే స్వేచ్ఛ కోల్పోతామని అన్నారు.



బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు న్యాయం చేయడానికి మాత్రమే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కార్పొరేట్ ఆర్థిక విధానాల వల్ల దేశంలో దుష్ఫలితాలు, పేద వర్గాలకు నష్టం కలిగిస్తాయని అన్నారు. ఈనెల 2న అలంపూర్ నుండి ప్రారంభమైన యాత్ర గురువారం హన్మకొండ, వరంగల్ మీదుగా హుజురాబాద్ కు చేరుకుందని అన్నారు. యాత్ర ముగింపు ఈనెల 8న హైదరాబాద్ లో ఉంటుందని ఆయన తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రశ్నించే గొంతుకలను బిజెపి ప్రభుత్వం అణిచివేస్తూ కుట్రలు చేస్తుందని అన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం మాల మహానాడు ప్రజల్లో చైతన్య పరచడానికి రాజ్యాంగ రక్షణ యాత్ర చేపట్టిందని అన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు తోడ్పాటును అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, పురుషోత్తం, వెంకట్ స్వామి, రాజు, దేవయ్య, సమ్మయ్య, నాగరాజు, ఉదయ్, సొల్లు బాబు, మాజీ సర్పంచ్ తోగరు బిక్షపతి, పుష్పలత, పసుల స్వామి, పాక సతీష్, సునీత, ఎడ్ల విజయ్, జూపాక శ్రీనివాస్, కోడం నర్సింగరావు, నీరటి శ్రీనివాస్, హేమలత, పిట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అపోలో రీచ్ హాస్పిటల్ లో రెండు నూతన హెల్త్ చెక్ ప్యాకేజీలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఉత్తర తెలంగాణలోని ప్రధాన పట్టణమైన కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల అపోలో హాస్పిటల్ అనుబంధ సంస్థ అయిన అపోలో రీచ్ హాస్పిటల్, కరీంనగర్ లో గురువారం రోజున సాధారణ, మధ్యతరగతి ప్రజానీకానికి, అన్ని వర్గాలకు ఆర్థికంగా వెసులు బాటు ఉండేటట్టు రెండు నూతన హెల్త్ చెక్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.వాటిలో మొదటగా అపోలో రీచ్ హాస్పిటల్ కరీంనగర్ స్పైన్ కేర్ వెల్నెస్ (spine care wellness) ప్యాకేజ్ రూ. 5,999 ధరతో ఎమ్మారై (MRI) స్కానింగ్ ఏ కాకుండా వివిధ రకాల రక్త పరీక్షలు వెన్నుపాము కు సంబంధించిన సమస్యలను వాటికి గల కారణాలను అంచనా వేయుటకు ఈ ప్యాకేజీలో పెట్టడం జరిగింది. దీనితోపాటు న్యూరో సర్జన్ యొక్క సంప్రదింపులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుంది,రెండవ ప్యాకేజీ వివరాలలోకి వెళితే గడిచిన గత రెండు శతాబ్దాల కాలంలో యుక్త వయసులోనే సాధారణ ప్రజానీకం వివిధ కారణాల చేత, జీవన విధానంలో కాలుష్యకారకాల చేత,ఊబకాయంతో తీవ్రమైన మోకాళ్ళ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.ఇట్టివారిని దృష్టిలో ఉంచుకొని అపోలో రీచ్ కరీంనగర్ నీ పెయిన్ వెల్నెస్ (knee pain wellness) ప్యాకేజ్ వివిధ రకాల ఎక్స్రేరే, రక్త పరీక్షలు 1,499 రూపాయలకే అందించడం జరుగుతుంది.హాస్పిటల్ పరిపాలకుడు డాక్టర్ నాగ సతీష్ మాట్లాడుతూ పై తెలిపిన రెండు ప్యాకేజీలు మోకాళ్లు, వెన్నుపాము కు సంబంధించిన సమస్యలను ఎంతో సమర్థవంతంగా గుర్తించగలుగుతాయని, ప్యాకేజీలో స్కానింగ్ మరియు రక్త పరీక్షలే కాకుండా సంబంధిత వైద్య నిపుణుల సంప్రదింపులు కూడా ఉచితంగా అందించడం జరుగుతుందని అందరికీ అందుబాటులో ఉండేటట్లు ఇట్టి ప్యాకేజీ ధరలు కూడా నిర్ధారించడం జరిగిందని, కావున సాధారణ ప్రజానికం యొక్క ప్యాకేజీ ను ప్రజలు పెద్ద ఎత్తున ముందటికి వచ్చి సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా కోరినారు.

## డీలర్లు స్టాక్ రిజిష్టర్లను తప్పకుండా మెయింటన్ చెయాలి

### -జిల్లా వ్యవసాయ అధికారి వాణి

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని రైతు వేదిక కార్యాలయం లో గురువారం రోజు వ్యవసాయ ఇన్ పుట్ డీలర్ల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వాణి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ మండలం లోని డీలర్లు అందరు విత్తన, ఎరువులు, పురుగుమందుల స్టాక్ రిజిష్టర్ లను తప్పకుండా మెయి%శీ%టన్ చేయాలనీ ఎరువులను తప్పకుండా ఈ పాస్ మిషన్ ద్వారానే అమ్మాలని, స్టాక్ నిల్వలు వాటికి సంబందించిన బిల్లులు సరిగా మెయి%శీ%టన్ చేయాలనీ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరపాలని డీలర్లకు సూచించారు. ఆనంతరం రామకిస్టాపూర్ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిసిలించి రైతులకు తాలు తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. వరి పొలాన్ని సందర్శించి కోత సమయం లో హార్వెస్టర్ ఆర్ పిఎం 18-19, పెట్టడం వల్ల నాణ్యమైన ధాన్యాన్ని పొందవచ్చు అని కోత కోసే సమయం లో ఆర్ పిఎం సరిగా మెయి%శీ%టన్ చేయాలనీ హర్వెస్టర్ డ్రైవర్ లకు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి పర్లపల్లి జ్యోతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల డీలర్లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో అక్రమ నిర్మాణాలు, వే బ్రిడ్జిని కూల్చి వేసిన ఎస్సారెస్పీ అధికారులు

**సూర్య తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ) స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్వహిస్తున్న వేబ్రిడ్జిను బుధ వారం సాయంత్రం అధికారులు కూల్చి వేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన తిమ్మాపూర్ జడ్పీటీసీ ఇనుకొండ శైలజ భర్త, కొత్తపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్ రెడ్డి అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో కొత్తపల్లిలోని ఎస్సారెస్పీ స్థలాన్ని కబ్జా చేశారు.అంతే కాకుండా ఆ స్థలంలో షెడ్ నిర్మించి తన వ్యాపార వృద్ధి కోసం వే బ్రిడ్జిని నెలకొల్పడం జరిగింది. ఈ ప్రాంతంలో గల మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణ యథేచ్ఛగా కొనసాగడం, గుట్టల నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ తరలిస్తుండటాన్ని అదునుగా చేసుకొన్న జితేందర్ రెడ్డి అక్రమార్జన కోసమే ఎస్సారెస్పీ స్థలాన్ని ఆక్రమంగా ఆక్రమించుకొని ఆ స్థలంలో షెడ్ నిర్మించడమే కాకుండా వేబ్రిడ్జిని ఏర్పాటు చేశారు.ఈ విషయమై గత బీఆర్ఎస్ హయాంలో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గనులు ధ్వంసమవుతున్నాయని, పెద్దమొత్తంలో ఇసుక అక్రమ తరలింపు వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం పొంచి ఉందని ఈ ప్రాంత రైతులు ఎంత మొత్తుకున్నా ఫలితం లేకుండా పోయింది.అయితే ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల అక్రమ భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపడంతో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా జితేందర్ రెడ్డి ఆక్రమణలు,అక్రమ వ్యాపారంపై ఫిర్యాదులు అందడంతో ఎస్సారెస్పీ అధికారులు సత్వరమే స్పందించి చర్యలకు పూనుకున్నారు.అందులో భాగంగానే ఎస్సారెస్పీ పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ) శివకుమార్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం కొత్తపల్లిలో జితేందర్ రెడ్డి అక్రమంగా నిర్వహిస్తున్న వేబ్రిడ్జితోపాటు షెడ్ ను జేసీబీతో కూల్చివేయించారు.పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలను అధికారులు నిర్విఘ్నంగా నిర్వహించారు.

## మంథని నియోజక వర్గ బిజెపి మండల పార్టీ అధ్యక్షుల నియామకం

**సూర్య మంథని**



పెద్దపల్లి జిల్లాలోని మంథని, అసెంబ్లీ నియోజకవర్గంనికి నూతన మండల పార్టీ అధ్యక్షులను జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి నియమించారు. మంథని నియోజకవర్గం లోని మంథని పట్టణానికి అధ్యక్షులుగా సబ్బాని సంతోష్, మంథని మండల అధ్యక్షులుగా వీరవేన రాజేందర్,కమాన్పూర్ మండల అధ్యక్షులుగా జంగపల్లి అజయ్, రామగిరి మండల అధ్యక్షులుగా ములుమూరి శ్రీనివాస్, ముత్తారం మండలం అధ్యక్షులుగా బిరుదు గట్టయ్య, మల్హార్ రావు మండలం అధ్యక్షులుగా ముడతన పల్లి ప్రభాకర్,కాటారం మండల అధ్యక్షులుగా బండం మల్లారెడ్డి, మహాముత్తారం మండల అధ్యక్షులుగా మేడిపల్లి పూర్ణ చందర్, మహాదేవ్ పూర్ మండల అధ్యక్షులుగా ఆకుల శ్రీధర్, పలిమెల మండల అధ్యక్షులుగా కోయాల్కర్ నిరంజన్ లను జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి నియమించారు. ఈ నియామకం తక్షణమే అమలు అవుతుందని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డికి నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా..

### -ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**సూర్య జగిత్యాల**



ఒడ్డెర కులస్థుల సంక్షేమానికి కృషి చేస్తా అని పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్లో గురువారం నిర్వహించిన సమావేశంలో అంతర్గాం ఒడ్డెర కాలనీ మాజీ సర్పంచ్ గంగాధర్, ఎల్లయ్య, నర్సయ్య, స్వామి, యువకులు గురువారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఒడ్డెర కాలనీలో మౌలిక వసతులు కల్పించి, భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఒడ్డెర కులస్తులను ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించడంతోపాటు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న సెస్ కార్మికుల సంక్షేమానికి వెచ్చించాలి. శ్రమకు నిర్వచమైన ఒడ్డెర కులస్తుల హక్కుల రక్షణకు తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. ఒడ్డెరకాలనీలోని పాఠశాలకు ప్రహరి నిర్మాణంతోపాటు అదనపు గదులు నిర్మాణం చేపడుతామన్నారు. అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. చౌకధరల దుకాణం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి రూపాయి సాయం ఆశించకుండ రామాలయ నిర్మాణానికి విరాళాలు సేకరించుకొని నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఒడ్డెర కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం సీఎం రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.20లక్షలు కేటాయించామన్నారు. రామాలయ నిర్మాణానికి సీజీఎఫ్ నిధుల నుండి రూ.50లక్షల నిధులు మంజూరు చేస్తామని జీవన్రెడ్డి హామీ ఇచ్చారు. అంతర్గాంలోని ఆంజనేయస్వామి ఆలయానికి రూ.1కోటి నిధులు కేటాయించామని గుర్తు చేశారు.రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచి, ఎంపీగా గెలిపించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జీవన్రెడ్డి పిలుపునిచ్చారు.

## ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

### -తహసిల్దార్, ఎంపీడీవో.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని తాహసిల్దార్ జాహిద్ పాషా, ఎంపీడీవో రామ్మోహన చారి లు అన్నారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరాంపూర్ సింగిల్ విండో, ఐకెపి ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గంగారం, శ్రీరాంపూర్, లక్ష్మీపూర్, పందిళ్ళ,ఆరేపల్లి, తారుపల్లి,మల్యాల ,కిష్టంపేట్, మొట్లపల్లి, చిన్న రాతుపల్లి, పెగడపల్లి, పెద్ద రాతుపల్లి, ఆశన్నపల్లి, ఇప్పలపల్లి ,పెద్దంపేట్, అంకంపల్లి, మడిపల్లి కాలనీ, మడిపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రత్యేక అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఆరబోసి శుభ్రపరచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. గ్రామాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి రైతులకు కొనుగోలు కేంద్రాల్లో నీటి వసతి తో పాటు, గన్ని సంచుల కొరత లేకుండా చూడాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆశాడపు కనకయ్య, సీఈవో కొల్లేటి శ్రీనివాస్, సి సి లు నిర్మల, శారద అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వ శ్రీరాంపూర్ పాఠశాలలో మాకు పోల్ ఎన్నికలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నరెడ్ల సునీత ఆధ్వర్యంలో గురువారం పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడం కోసం మాదిరి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 6 తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులతో ఓటర్ లిస్టు తయారుచేసి ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసి, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మాక్ పోల్ లో విద్యార్థులకు ఎన్నిక గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కే.వెంకటేష్ , కె .సత్య ప్రకాష్ రావు, బి.వెంకటస్వామి పి. జోష్న ఈ. కిషన్ సి.హెచ్. ఏసు, కె .వెంకటస్వామి, బి. దినేష్, ఎం.డి. అజ్మత్ బి తదితరులు పాల్గొన్నారు.

# పోన్లు ట్యాంపరింగ్ చేసి కేటీఆర్ గెలిసిండు

## -జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మునిగేల రాజు

**సూర్య తంగళ్లపల్లి**

మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు.స్వంత పార్టీ నేతలు,ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాంపరింగ్ చేసిన వ్యక్తి కేటీఆర్ అంటూ ఫైర్, ట్యాంపరింగ్ వ్యవహారంలో కేటీఆర్ ఏమ్మెల్యే సభ్యత్వం కోల్పోయి జైలుకు పోవడం ఖాయం,బెదిరింపు రాజకీయాలు మావీ కాదు మీవి..అందుకే ఒక్కొక్కరిగా జైళ్ళ పాలు అవుతున్నారు. జిల్లేళ్ళ గ్రామంలో 20 గంటల భూమికి పరిహారం రాకుండా ఆపింది ఎవరో ఆత్మపరిశీలన చేసుకోవాలి. కాల్వలు పూర్తి అయితే అందరికీ మంచిది..నీళ్ళు రాకపోవడానికి కారణం మీరే కారణం,కెటిఆర్ చేయని తప్పు లేదు. దోపిడి లక్ష్యంగా పాలన సాగిస్తూ కోట్లు దోచుకున్నాడు.బెదిరింపు రాజకీయాలు చేసిన వ్యక్తులు ఎవరో ప్రజలందరికీ తెలుసు. అప్పుడు మీరు చేసినా బెదిరింపు రాజకీయల వల్లనే



ఇప్పుడు జైలు పాలు అవుతున్నారు.రాబోయే కాలంలో అవినీతి నేతల భరతం పడతాం.పేదలకు అండగా ఉంటాం.రైతులకు నష్టపోయిన పరిహారం ఇవ్వాలని మీరు మాట్లాడడం సిగ్గుచేటు.మీ ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయిన..బస్వాపూర్ రైతులను ఆదుకోలేదు ఎందుకు,బస్వాపూర్ రైతులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులకు దిగినా చరిత్ర మీది,బస్వాపూర్ రైతులకు ఎంత నష్టపరిహారం ఇచ్చారో చెప్పి రైతుల గురించి మాట్లాడాలి.జిల్లేళ్ళ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం జరిగి యేండ్లు గడుస్తున్నా పంపిణీ చేసిన పాపాన పోలేదు. కేకే మహేందర్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు.మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్క రాజశేఖర్ , సోషల్ మీడియా జిల్లా కాంగ్రెస్ ఆర్డినేటర్ చోటు,మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్ ,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎగుర్ల ప్రశాంత్,అసెంబ్లీ సోషల్ మీడియా కాంగ్రెస్ ఆర్డినేటర్ అభినయ్ గౌడ్,ఫిషరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఎడ్ల తిరుపతి,అంకారాపు మధు , వినోద్ , నరేందర్ , వినయ్ , సాయికుమార్ , తదితరులు పాల్గొన్నారు .

# రైతులకు క్షమాపణ చెప్పి జిల్లాల పర్యటన చేయాలి

## -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జె ప్రవీణ్

**సూర్య తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన మండల అధ్యక్షుడు జె ప్రవీణ్, నాయకులు. అధికారంలో ఉండి రైతులను ఆదుకొని చవట దద్దమ్మలు ఇప్పుడు పర్యటనలకు వస్తున్నారని, కెసిఆర్, కేటీఆర్ లు ముందుగా రైతులకు క్షమాపణలు చెప్పి జిల్లాల పర్యటనకు రావాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లాల సరిహద్దులోనే అడ్డుకుంటామని హెచ్చరించారు. మీ తప్పులను ఎత్తిచూపితే మాకు అర్హత లేదంటారా, మరి రైతులను నిండా ముంచిన మీకేమీ అర్హత ఉంది మమ్మల్ని విమర్శించడానికి, రంగనాయక సాగర్ నుండి మండలానికి నీళ్లు తేవడానికి కాలువల నిర్మాణం పూర్తి చేశారా, ప్రతిపక్ష పార్టీ లీడర్లుగా ప్రజల పక్షాన పోరాడండి



స్వాగతిస్తాం, కానీ ఉన్న వాస్తవాలను పక్కకు పెట్టి ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదు. 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ అయ్యిందని బిఆర్ఎస్ నేతలకు ఇంకా తెలవకపోవడం హాస్యాస్పదం. బిజెపి, బి ఆర్ ఎస్ ప్రభుత్వాలు చీకటి ఒప్పందం కుదుర్చుకొని రైతులను నిండా ముంచాయని, రైతుల కన్నీళ్లకు కారణమైన బిజెపి,బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడేమో ముసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని రైతులెవరు దళారులకు అమ్మి మోసపోవద్దని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్, జిల్లా నాయకులు లింగాల భూపతి, కొత్త రవీందర్, మైనార్టీ అధ్యక్షులు ఇక్బాల్, ఫిషర్ కమిటీ అధ్యక్షులు ఇటుకల మహేందర్,మండల నాయ కులు బాలసాని శ్రీనివాస్,మిరాల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్,గ్రామ అధ్యక్షులు గణాది కిషన్,రమేష్,సత్యం, నాయకులు పయ్యావుల శ్రీను,విజయ్,హమీద్,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో రైతు దీక్ష..

# కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ తక్షణమే అమలు చేయాలి..

## -మండల శాఖ అధ్యక్షులు రవీందర్ రెడ్డి..

**సూర్య బోయినపల్లి**

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు, జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ పిలుపు మేరకు బోయిన్పల్లి మండల కేంద్రంలో రైతు దీక్ష చేపట్టడం జరిగిందని మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వము అధికారంలోకి రాకముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని రైతు దీక్ష చేపట్టడం జరిగింది అని అన్నారు, ఈ సందర్భంగా గుడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ%శీ%, ఎన్నికల ముందు వంద రోజులలో చేస్తానన్నా హామీలు రైతు పండించిన పంటకు క్వింటాల్ వరి ధాన్యానికి 500



రూపాయల బోనస్, రైతు భరోసా కింద ఎకరానికి రైతుకు15000 రూపాయలు, కౌలు రైతుకు 15000 రూపాయలు, రైతు కూలీలకు 12,000/-రూపాయలు, రెండు లక్షల రూపాయల రుణమాఫీ,2,00,000, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి,వరి ధాన్యాన్ని కొనుగోళ్ల పేరుతో తాలూ తరుగు తేమ పేరుతో క్వింటాల్ కు 10 కిలోల అధిక దోపిడీని అరికట్టాలి అని డిమాండ్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి చొప్పదండి నియోజకవర్గం జాయింట్ కన్వీనర్, ఉదారి నరసింహ చారి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఎడపల్లి పరశు రాములు, ఉపాధ్యక్షులు రెడ్డ వేణి రాజు, దళిత మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, యువ మోర్చా మండలాధ్యక్షులు కొనుకటి హరీష్, బిజెపి సీనియర్ నాయకులు శక్తి కేంద్రం ఇన్చార్జి క్యాతం తిరుపతిరెడ్డి, బిజెపి మండల కార్యదర్శి రేండ్ల మహేందర్, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రాజూరి కిరణ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మినుకుల శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు సింగరి వెంకటేష్, రజనీకాంత్, ధర్మేంద్ర, మేదరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులను భయబ్రాంతులకు గురిచేసిన వ్యక్తుల పై కేసు నమోదు

**సూర్య, వీణవంక:**

వీణవంక మండలం పోతిరెడ్డి పల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని గొల్లపల్లిలో బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఆకుల రఘు, ఆశాడపు వినయ్ ల ట్రాక్టర్లు అక్రమ ఇసుక లోడు తో కలిగి ఉండగా అటు వైపు వెళ్ళిన పోలీసులకు కంటపడగనే అట్టి వారిని విచారించగా అక్రమమనే ఒప్పుకోగా పోలీస్ స్టేషన్ కు తరలించాలని చెప్పినప్పటికీ ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులను భయబ్రాంతులకు గురిచేయడం తో చేసేదిలేక ఎస్ఐ కి జరిగిన ఉదంతం వివరించడంతో పై ఇద్దరి ట్రాక్టర్ల యాజమానుల పై కేసు నమోదు చేయగా వినయ్ ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు కు తరలించారు. మరో వ్యక్తి ఆకుల రఘు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తోట తిరుపతి గురువారం తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం జంగంపల్లి గ్రామంలో అంబాల అంకుసమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అతిథి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి తన అనుచరులను పంపించి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్ రెడ్డి యువ సైన్యం వ్యవస్థాపకులు సతీష్, ప్రశాంత్, కర్ణాకర్, శ్రావణ్, అనిల్, గురవరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాకేష్, బీరయ్య, తిరుపతి, రామస్వామి, అజయ్ కుమార్, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులను సంరక్షించాలి

## -హరితహారం మొక్కల పై ప్రత్యేక దృష్టి సారించండి

## -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. వాటి ఆవాసాలు ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వన్య ప్రాణులు, అడవుల సంరక్షణపై కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడంతోపాటు మన్యప్రాణులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలం నేపథ్యంలో వాటికి తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వాటి రక్షణకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఎఫ్ఓ బాలామణి, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, సిసిఎస్ ఏసిపి కాశయ్య, అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాస్ రెడ్డి రాజేందర్ రావు, ఏటీడీవో దివాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రణవ్

**సూర్య, వీణవంక**



రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని గురువారం వీణవంక మండల కేంద్రంలోని చల్లూరు గ్రామంలోని మసీద్ లో ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో ఇఫ్తారు ఇవ్వడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ వొడితల ప్రణవ్ హాజరై విందు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళి శాంతికి రంజాన్ ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాహెబ్ హుస్సేన్, రజాక్ తో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

## కిడ్స్ కాన్వెంట్ స్కూల్‌లో

# కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**సూర్య వేములవాడ టౌన్**



కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అద్భుత ముగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో భాగముగా చిన్న పిల్లలు తమ యొక్క డాన్స్ పర్ఫామేన్స్ తో అందరిని అలరించారు, గ్రాడ్యుయేషన్ డ్రెస్ లో పిల్లలు కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా చేతులమీదుగాసర్టిఫికెట్స్అందుకున్నారు ఈ కార్యక్రమం లో ,కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా, పిల్లల తల్లిదండ్రులు, టీచర్స్ పాల్గొన్నారు